


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




# స్వచ్ఛాంధ్ర సాకారానికి పటిష్ట కార్యాచరణ

- 100 శాతం చెత్త సేకరణ, ప్రాసెసింగ్ జరగాలి
- మున్సిపాలిటీల్లో కొత్తగా పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం
- పార్కులుగా గ్రామీణ, పట్టణ సరిహద్దు డంపింగ్ యార్డులు
- 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' సమీక్షలో సీఎం చంద్రబాబు
- స్వచ్ఛాంధ్ర ర్యాంకుల్లో విశాఖ జిల్లాకు మొదటి స్థానం...
- చివరిస్థానంలో నిలిచిన ఏఎస్ఆర్ జిల్లా

2

స్వచ్ఛాంధ్ర సాకారం కావడానికి నిర్దేశించుకున్న లక్ష్యాలు నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. లక్ష్యాలు చేరుకోవడంలో విఫలమైతే... కారణాలు అన్వేషించి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయంలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఈ ఏడాది మార్చి 31 వరకు రూపొందించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాంకులను అధికారులు ముఖ్యమంత్రికి వెల్లడించారు. విశాఖపట్నం, విజయనగరం, గుంటూరు జిల్లాలు స్వచ్ఛాంధ్రలో మొదటి మూడు స్థానాల్లో ఉండగా... శ్రీ సత్యసాయి, పార్వతీపురం మన్యం, ఏఎస్ఆర్ జిల్లాలు చివరి మూడు స్థానాల్లో ఉన్నట్టు తెలిపారు.

## మద్యం షాపును మంత్రి ఆకస్మికంగా తనిఖీ

- లిక్కర్ బిజినెస్‌లో అవకతవకలు సహించేది లేదు
- ఎక్సైజ్‌ను అడ్డుపెట్టుకుని గత ప్రభుత్వం జేబు నింపుకుంది
- జగన్‌రెడ్డి సొంత బ్రాండ్లతో వేలాది ప్రాణాలు తీశారు
- కూటమి పాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం...
- గుంటూరులో మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టీకరణ

3



## అంగరంగ వైభవంగా పెంచలకోన బ్రహ్మోత్సవాలు



- సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ దర్శన ఏర్పాట్లు
- అధికారులందరూ సమర్ధవంతంగా పనిచేయాలి
- బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఫెస్టివల్ కమిటీని నియమించాం
- త్వరలోనే రాష్ట్ర పండుగగా పెంచలకోన బ్రహ్మోత్సవాల నిర్వహణ
- సీఎం ఆదేశాల మేరకు ప్రతి ఆలయాన్నీ అభివృద్ధి చేస్తున్నాం
- రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

5

## హజ్ యాత్రకు ఏర్పాట్లు పూర్తి

- యాత్రికుల ప్రయాణానికి సర్వం సిద్ధం
- నేడు తొలివిడత యాత్రికుల ప్రయాణం
- జెండా ఊపి ప్రారంభించనున్న మంత్రి ఫరూక్
- రాష్ట్ర విభజన అనంతరం గన్నవరంనుంచి తొలిసారి హజ్ యాత్ర
- యాత్రికుల భద్రతే అత్యంత ప్రాధాన్యమని ముఖ్యమంత్రి సూచన
- మైనార్టీ వ్యవహారాల సంక్షేమ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

3





## అది మహిళలకు కాంగ్రెస్ చేసిన ద్రోహం

మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షం మహిళా సాధికారత దిశగా భారతదేశం తీసుకోబోయే చారిత్రాత్మక ముందడుగును నిరాకరించింది. ఇది కేవలం రాజకీయ అడ్డంకి మాత్రమే కాదు, పార్లమెంటులో సమాన వాణికి, న్యాయమైన ప్రాతినిధ్యానికి అర్హులైన లక్షలాది మహిళలకు చేసిన ద్రోహం. దేశం దీనిని గుర్తుంచుకుంటుంది.

-ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

## నేడు సీఎం చంద్రబాబు నిడదవోలు పర్యటన

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమానికి హాజరు

- వివరాలు 2 లో..



## పరబ్రహ్మ స్వరూపాన్ని నేలపాల్జేసిన దుర్మార్గుడు!

గత జగన్ ప్రభుత్వ వైఖరిపై నిమ్మల ధ్వజం

- వివరాలు 7 లో..



## ఆత్మకూరులో ప్రతిష్టాత్మకంగా సీఎం జన్మదిన వేడుకలు

భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్న మంత్రి ఆనం

- వివరాలు 5 లో..



## సూర్యఘర్‌తో నిరంతర వెలుగులు

- రాష్ట్ర వ్యాప్తంగా 6 లక్షల ఉచిత సూర్యఘర్ కనెక్షన్లు మంజూరు
- వచ్చే సీజన్‌కు పూర్తిస్థాయిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు
- రాయదుర్గంలో పీఎం సూర్యఘర్ ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి

- వివరాలు 6 లో..

చైతన్యరథం

# స్వచ్ఛాంధ్ర సాకారానికి పటిష్ట కార్యాచరణ

- 100 శాతం చెత్త సేకరణ, ప్రాసెసింగ్ జరగాలి
- మున్సిపాలిటీల్లో కొత్తగా పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం
- పార్కులుగా గ్రామీణ, పట్టణ సరిహద్దు డంపింగ్ యార్డులు
- 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' సమీక్షలో సీఎం చంద్రబాబు
- స్వచ్ఛాంధ్ర ర్యాంకుల్లో విశాఖ జిల్లాకు మొదటి స్థానం...
- చివరిస్థానంలో నిలిచిన ఏఎస్ఆర్ జిల్లా



అమరావతి (చైతన్య రథం): స్వచ్ఛాంధ్ర సాకారం కావడానికి నిర్దేశించుకున్న లక్ష్యాలు నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. లక్ష్యాలు చేరుకోవడంలో విఫలమైతే... కారణాలు అన్వేషించి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయంలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఈ ఏడాది మార్చి 31 వరకు రూపొందించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాంకులను అధికారులు ముఖ్యమంత్రికి వెల్లడించారు. విశాఖపట్నం, విజయనగరం, గుంటూరు జిల్లాలు స్వచ్ఛాంధ్రలో మొదటి మూడు స్థానాల్లో ఉండగా... శ్రీ సత్యసాయి, పార్వతీపురం మన్యం, ఏఎస్ఆర్ జిల్లాలు చివరి మూడు స్థానాల్లో ఉన్నట్టు తెలిపారు. ఇందులో విశాఖ జిల్లాకు 92శాతం, విజయనగరం, గుంటూరు జిల్లాలకు 85శాతం మార్కులు వచ్చాయి. అట్టడుగున ఉన్న ఏఎస్ఆర్ జిల్లాకు కేవలం 53శాతం మార్కులు మాత్రమే వచ్చాయి. డోర్ టు డోర్ కలెక్షన్, తడి చెత్త-పొడి చెత్త వేరు చేయడం, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఓడీఎఫ్ ప్లస్ మోడల్ వంటివి ర్యాంకులకు ప్రాతిపదికగా తీసుకున్నట్టు చెప్పారు.. అయితే ఇకపై జిల్లాలకు స్వచ్ఛాంధ్ర ర్యాంకులు థర్డ్ పార్టీ ఇచ్చేలా చూడాలని సీఎం సూచించారు.

### జూన్‌నాటికి 100 శాతం చెత్త క్లియర్

మున్సిపాలిటీల్లో అవసరమైన చోట కొత్తగా పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే నిర్ణీత పరిధిలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు నెలకొల్పేలా చూడాలన్నారు. గతంలో వ్యర్థాలతో నిండిపోయిన డంపింగ్ యార్డుల్లో... ప్రస్తుతం చెత్త క్లియర్ చేయడంతో పాటు ఆయా స్థలాలను పచ్చదనంతో నింపేలా చూడాలన్నారు. గ్రామాలు, పట్టణానికి సమీపంలో ఉన్న డంపింగ్ కేంద్రాలను ముందుగా పార్కులుగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. 2024 జూన్ నుంచి నేటి వరకు పట్టణాల్లో 153 లక్షల టన్నుల చెత్తకు గాను, 114 లక్షల టన్నుల చెత్త తొలగించినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ జూన్ కల్లా 100 శాతం క్లియర్ చేయాలని సీఎం ఆదేశించారు. గ్రామాల్లో పేరుకు పోయిన 10 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలిగించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, ఇంటింటికీ చెత్త సేకరణ, చెత్త ప్రాసెసింగ్ కూడా 100 శాతం జరగాలన్నారు. కంపోస్ట్ మార్కెటింగ్ చేసేందుకు మార్క్‌ఫెడ్‌కు సమన్వయ బాధ్యతలు అప్పగించాలని సీఎం సూచించారు. మ్యాజిక్ డ్రెయిన్లకు అనుసంధానంగా కమ్యూనిటీ సోక్ పిట్స్ తీసుకురావడం ద్వారా మురుగునీటి సమస్య పరిష్కారం కావడంతో పాటు, భూగర్భ జలాలు పెరిగేందుకు దోహద పడుతుందని సీఎం అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోనూ తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ, సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు, నెట్ జీరో, గ్రీనరీ పెంపు, క్లీన్-హైజీన్ కిచెన్ వంటి అంశాలపై ముఖ్యమంత్రి పలు మార్గదర్శకాలు జారీ చేశారు. గాలి నాణ్యత పర్యవేక్షణకు ప్రస్తుతమున్న 83 ప్రాంతాలతో పాటు, అదనంగా 53 మాన్యువల్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు.

### డిసెంబర్‌నాటికి గోబర్ ధన్ ప్లాంట్లు సిద్ధం

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణకు, ఈ వేస్ట్ కలెక్షన్‌కు సంబంధించి అమలు చేస్తున్న విధానాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో 633 స్వచ్ఛ రథాలతో రోజుకు 125 టన్నుల పొడి చెత్త సేకరిస్తున్నామని, గోబర్ ధన్ యూనిట్లు, గ్రీన్ షాప్స్ ద్వారా చెత్తను ఆదాయంగా మారుస్తున్నామని అధికారులు తెలిపారు. మురుగు నీటి నిర్వహణలో కూడా సమూల మార్పులు తెస్తున్నామని... గ్రే వాటర్, బ్లాక్ వాటర్ నిర్వహణకు భారీ ప్రాజెక్టులు చేపట్టినట్టు వివరించారు. పొడి చెత్తను సేకరించే గ్రీన్ షాపులకు స్వచ్ఛ రథం ఏజెన్సీ నుంచి, పంచాయతీ నుంచి సాయం అందించేలా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ కల్లా గోబర్ ధన్ ప్లాంట్లు సిద్ధం అవుతాయని వెల్లడించారు. అలాగే 'స్వచ్ఛ పథం' పేరుతో గ్రామీణ రోడ్ల శుభ్రత కోసం ప్రత్యేక వాహనాలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

### 590 ఎకరాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కులు


10 జిల్లాల్లో 590 ఎకరాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కులు అభివృద్ధి చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. పట్టణాల్లో 2024-2026 మధ్య గ్రీన్ స్పేస్ పార్కులు 57అభివృద్ధి చేసినట్టు వివరించారు. మరో 284 గ్రీన్‌స్పేస్ పార్కులు, 100 స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పార్కులు అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని అధికారులు తెలపగా, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని సూచించారు.గ్రామాల్లో మురుగునీటి నిర్వహణకు సోక్ పిట్స్, కిచెన్ గార్డెన్స్, మ్యాజిక్ డ్రెయిన్స్ వంటి విధానాలు అవలంభిస్తున్నామని, ఈ ఏడాది డిసెంబర్ కల్లా...7.14లక్షల కిచెన్ గార్డెన్స్, 1 లక్ష సోక్ పిట్స్, 8,000 కమ్యూనిటీ సోక్ పిట్స్, 100కి.మీ. మ్యాజిక్ డ్రైన్స్ నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ కల్లా అన్ని గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్‌గా నిలపాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 31.33శాతంగా ఉన్న గ్రీన్ కవర్‌ను... 2030నాటికి 37శాతానికి, 2047 కల్లా 50శాతానికి పెంచేలా ప్రణాళికలురూపొందించాలన్నారు. సమీక్షలో మంత్రి నారాయణ, పీసీబీ చైర్మన్ కృష్ణయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఎంఏయూడీ కమిషనర్ సంపత్ కుమార్, పంచాయతీరాజ్ శాక డైరెక్టర్ కృష్ణ తేజ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

---

## నేడు సీఎం చంద్రబాబు

# నిడదవోలు పర్యటన

### స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమానికి హాజరు



అమరావతి (చైతన్య రథం): తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం పర్యటిస్తారు. నిడదవోలులో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రతీ నెలలో 3వ శనివారం చేపట్టే స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ఒక్కో థీమ్‌తో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 'జలధార-జలహారతి' థీమ్‌తో కార్యక్రమాన్ని చేపడుతున్నారు. నీటి ఆవశ్యకతను వివరించేందుకే థీమ్‌ను ప్రభుత్వం ఎంచుకుంది.

### ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వివరాలు

నిడదవోలులో నిర్వహించే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి ఉదయం 10.30 గంటలకు బయలుదేరుతారు. 11.00 గంటలకు నిడదవోలు చేరుకుంటారు. 11.20 గంటలకు సుబ్బరాజుపేటలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 1.50 గంటలకు మలకోడు సరస్సును సందర్శించి స్థానికులు, శాస్త్రవేత్తలు, నిపుణులతో ఇంట్రాక్ట్ అవుతారు. 2.30కు ఎస్టీ అంబ్రోస్ స్కూలు సమీపంలో నిడదవోలు నియోజకవర్గ టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 4.45 గంటలకు అమరావతికి చేరుకుంటారు.

---

## లోక్‌సభలో వీగిపోయిన

# మహిళా రిజర్వేషన్ బిల్లు



ఢిల్లీ (చైతన్య రథం): కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. 298మంది సభ్యులు అనుకూలంగా, 230మంది సభ్యులు వ్యతిరేకంగా ఓటు వేశారు. మహిళా రిజర్వేషన్ల అమలును వేగవంతం చేయడానికి, జనాభా గణన లేకుండానే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడానికి ఉద్దేశించిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లును లోక్‌సభ శుక్రవారం తిరస్కరించింది. కాగా, లోక్‌సభలో ఈ బిల్లు ఆమోదం పొందడానికి కేంద్రంలోని అధికార ఎన్డీయే కూటమికి 326 ఓట్లు అవసరం. సభలో ఈ బిల్లుపై ఓటింగ్ సందర్భంగా మొత్తం 528 మంది ఎంపీలు పాల్గొన్నారు. 298మంది సభ్యులు బిల్లుకు అనుకూలంగా ఓటు వేయగా, 230మంది సభ్యులు వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో జనాభా గణన లేకుండానే నియోజకవర్గాల పునర్విభజనతో ప్రతిపాదించిన మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. సభలో జరిగిన ఓటింగ్‌లో మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించలేకపోవడం వల్ల, రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు ఆమోదం పొందలేదని స్పీకర్ ఓం బిర్లా తెలిపారు.

---

## 'సవరణ బిల్లును అడ్డుకోవడం సమాఖ్య సమతుల్యతపై దాడి'



అమరావతి (చైతన్య రథం): డీలిమిటేషన్ మరియు రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకోవడం ద్వారా ప్రతిపక్ష పార్టీలు దక్షిణ భారతదేశానికి, ఈశాన్య రాష్ట్రాలకు, చిన్న రాష్ట్రాలకు ద్రోహం చేశాయని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. "రాజ్యాంగంలోని ఆర్టికల్ 81 ప్రకారం రాష్ట్రాల వారీగా నియోజకవర్గాల పంపిణీ ఇప్పటివరకు స్తంభించిపోయింది. అయితే ప్రతిపాదిత బిల్లులు లేకపోవడంతో 2026 జనాభా లెక్కల తర్వాత, ప్రాతినిధ్యం కేవలం జనాభా ఆధారంగానే నిర్ణయించబడుతుంది. ఇది మంచి పనితీరు కనబరిచి, జాతీయ ప్రాధాన్యతలను నిలబెట్టిన రాష్ట్రాలను దండించినట్టే అవుతుంది. ప్రతిపక్ష పార్టీల ప్రోత్సాహంతో సమాఖ్య సమతుల్యతపై జరుగుతున్న ప్రత్యక్ష దాడి ఇది" అని పేర్కొన్నారు.

# మద్యం షాపును మంత్రి ఆకస్మికంగా తనిఖీ

- లిక్కర్ బిజినెస్‌లో అవకతవకలు సహించేది లేదు
- ఎక్సైజ్‌ను అడ్డుపెట్టుకుని గత ప్రభుత్వం జేబు నింపుకుంది
- జగన్‌రెడ్డి సొంత బ్రాండ్లతో వేలాది ప్రాణాలు తీశారు
- కూటమి పాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం...
- గుంటూరులో మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టీకరణ



గుంటూరు (చైతన్య రథం): ఏపీ ఎక్సైజ్ వ్యవస్థను సంపూర్ణంగా ప్రక్షాళన చేసి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గుంటూరు జిల్లా ఎక్సైజ్ కార్యాలయానికి విచ్చేసిన మంత్రి తొలుత మద్యం పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. శాంపిల్స్ పరిశీలించారు. అనంతరం మద్యం షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపు స్టాక్ రికార్డుల్ని తనిఖీ చేశారు. ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా బాటిళ్లను స్కాన్ చేసి వివరాలను పరిశీలించారు. షాపునకు వచ్చిన మద్యం కొనుగోలుదారులతో మాట్లాడి నాణ్యత గురించి ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. "రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎక్సైజ్ శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. ప్రజలకు నాణ్యమైన మద్యాన్ని అందించాం. గత ప్రభుత్వం కల్తీ మద్యాన్ని ప్రజల నెత్తిన రుద్దింది. సొంత బ్రాండ్ల అమ్మకంతో జేబులు నింపుకుంది. క్వాలిటీకి తిలోదకాలిచ్చి కల్తీ మద్యంతో సుమారు 30 వేలమంది ప్రాణాలు తీశారు. లక్షలాది ప్రజలు కిడ్నీ, లివర్ సమస్యలతో ఇప్పటికీ ఆస్పత్రుల్లో ప్రాణాలతో పోరాడుతున్నారు" అని పేర్కొన్నారు.

"అందుకే మద్యం అమ్మకాల్లో వినూత్న మార్పులు తీసుకొచ్చే లక్ష్యంతో విశాఖపట్నం, కాకినాడ, చిత్తూరు, కర్నూలు, గుంటూరులో టెస్టింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేశాం. ఈఎన్‌ఏ నుంచి డిస్టిలరీ, బాటిలింగ్ వరకు అన్నిచోట్లా పరీక్షలు నిర్వహిస్తున్నాం. బ్యాచ్‌వారీగా పరీక్షించిన తర్వాతే షాపులకు తరలిస్తున్నాం. ప్రతి బ్యాచ్‌వారీగా పరీక్షించి, మద్యంలో ఎలాంటి రసాయనాలున్నాయనేది కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. వైసీపీ హయాంలో ఏడాదికి సగటున 14 వేల శాంపిల్స్ పరీక్షిస్తే.. ప్రస్తుతం ఏటా నెలా 30 వేలకు పైగా శాంపిల్స్ సేకరించి పరీక్షిస్తున్నాం. ఫలితంగా నాసిరకమైన మద్యం కనిపించకుండా చేశాం" అని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

"గత ప్రభుత్వ హయాంలో నాణ్యమైన మద్యం బ్రాండ్లను తరిమేసి, కల్తీ బ్రాండ్లను తెచ్చారు. ఫలితంగా బీర్లు, మద్యం అమ్మకాలు పడిపోయాయి. పొరుగు రాష్ట్రాల నుంచి ఏపీకి మద్యం తరలింపు భారీగా పెరిగింది. గత ప్రభుత్వ హయాంలో సుమారు లక్ష కోట్ల మద్యం అమ్మకాలు జరిగితే డిజిటల్ లావాదేవీలు 1శాతం కూడా లేకుండా మొత్తం క్యాష్ అండ్ క్యారీ విధానంలో జరిపి తాడేపల్లి ప్యాలెస్ నుంచి దందా సాగించారు. కానీ నేడు రాష్ట్రంలో సుమారు 40 శాతానికి పైగా లావాదేవీలు డిజిటల్ పేమెంట్ల రూపంలోనే జరుగుతున్నాయి. గతంలో మద్యం షాపులకు ఇండెంట్లు మొత్తం వారికి నచ్చినట్లు చేశారు. డిక్టేటర్‌షిప్ కారణంగా కల్తీ మద్యానికి ఎక్కువ ఆర్డర్లు వచ్చాయి. కానీ నేడు ఆటోమేటెడ్ ఆర్డర్ ఫర్ సప్లై విధానం ద్వారా పారదర్శకతకు ప్రాధాన్యమిచ్చాం. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో రాష్ట్రంలో మద్యం అమ్మకాలు పెరగడంతోపాటుగా, పొరుగు రాష్ట్రాల్లో మద్యం అమ్మకాలు తగ్గాయి. నాటు సారా నిర్మూలనకు నవోదయం 2.0 కార్యక్రమం ప్రారంభించాం. సామాన్యుల కోసం రూ.99ల మద్యం అందుబాటులోకి తీసుకొచ్చాం" అని మంత్రి పేర్కొన్నారు.

"రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలతో వైసీపీ నేతలు కుట్రలకు తెరలేపారు. ఉద్దేశ్యపూర్వకంగా మొలకలచెరువు, ఇబ్రహీపట్నంలో కల్తీ మద్యం తయారు చేసి అమ్మేందుకు ప్రయత్నించి, ఆ నెపాన్ని ప్రభుత్వంపై నెట్టారు. కల్తీకి అవకాశమే లేకుండా ఎక్సైజ్ సురక్ష యాప్ కూడా తీసుకొచ్చాం. ఆ యాప్ ద్వారా ప్రతి మద్యం బాటిల్‌ను ట్రాక్ అండ్ ట్రేస్ చేయడంతో పాటుగా, తయారీ నుంచి ప్రతి వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాం. ఏ దశలోనూ తప్పు జరగడానికి వీల్లేకుండా చర్యలు తీసుకున్నాం. టైమింగ్స్, ఎమ్మార్పీ విషయాల్లో ఉల్లంఘనలకు పాల్పడకుండా అధికారులకు కీలక ఆదేశాలిచ్చాం" అని మంత్రి కొల్లు వివరించారు.

"రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌లను అవసరం మేరకు మరిన్ని పెంచేలా సన్నాహాలు చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల ఫలితంగా.. పొరుగు రాష్ట్రాల నుండి అక్రమ మద్యం రవాణా నిలిచిపోయింది. అదే సమయంలో అక్కడి మద్యంతో పోలిస్తే ఏపీలో నాణ్యమైన మద్యం అందుబాటులో ఉండడంతో.. సరిహద్దు జిల్లాల్లో అమ్మకాలు కూడా 30-50 శాతంవరకు పెరిగాయి. జగన్‌రెడ్డి హయాంలో దేశంలోనే అతిపెద్ద మద్యం కుంభకోణానికి పాల్పడ్డారు. విచారణ పారదర్శకంగా జరుగుతోంది. తప్పు చేసిన వారు ఎప్పటికీ తప్పించుకోలేరనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. రాష్ట్రంలోని ప్రతి మద్యం షాపులో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఏ షాప్ ఎప్పుడు తెరుస్తున్నారు, ఎప్పుడు మూస్తున్నారో పరిశీలించడం లక్ష్యంగా ఎక్సైజ్ ఐ యాప్ అందుబాటులో ఉంచాం. ఎక్కడైనా తప్పు జరిగినట్టు గమనిస్తే ప్రజలు స్వచ్ఛందంగా ఫిర్యాదు చేసే వెసులుబాటు కల్పించామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# హజ్ యాత్రకు ఏర్పాట్లు పూర్తి

- యాత్రికుల ప్రయాణానికి సర్వం సిద్ధం
- నేడు తొలివిడత యాత్రికుల ప్రయాణం
- జెండా ఊపి ప్రారంభించనున్న మంత్రి ఫరూక్
- రాష్ట్ర విభజన అనంతరం గన్నవరంనుంచి తొలిసారి హజ్ యాత్ర
- యాత్రికుల భద్రతే అత్యంత ప్రాధాన్యమని ముఖ్యమంత్రి సూచన
- మైనార్టీ వ్యవహారాల సంక్షేమ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



గన్నవరం (చైతన్య రథం): హజ్ యాత్రికుల ప్రయాణం సాఫీగా, సురక్షితంగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమగ్రంగా పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని మైనారిటీ సంక్షేమ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధికారులను ఆదేశించారు. గన్నవరంలోని ఎస్ఎమ్ కన్వెన్షన్ సెంటర్‌వద్ద హజ్ యాత్రికుల కోసం చేసిన తుది ఏర్పాట్లను శుక్రవారం మైనార్టీ వ్యవహారాల సంక్షేమ మంత్రి ఫరూక్ అధికారులతో కలిసి సమగ్రంగా పరిశీలించారు. యాత్రికుల సౌకర్యాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ చేసిన ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ.. తొలి విడతగా శనివారం ఉదయం 9 గంటలకు 160మంది హజ్ యాత్రికుల ప్రయాణాన్ని ఘనంగా జెండా ఊపి ప్రారంభించనున్నట్లు తెలిపారు. యాత్రికుల ప్రయాణం సాఫీగా, సురక్షితంగా సాగేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మైనార్టీల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని, పవిత్ర హజ్ యాత్రకు రాష్ట్రంనుండి ఈ ఏడాది 2005 మంది వివిధ ఎంబార్కేషన్ పాయింట్ల నుండి పవిత్ర మక్కా, మదీనా యాత్రకు ప్రయాణం సాగించనున్నారన్నారు. ఇందులో భాగంగా విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి రెండు విడతలుగా 335మంది వెళ్లనున్నారన్నారు. తొలివిడతలో శనివారం 160మంది, ఆదివారం రెండో విడతలో 175మంది వెళ్లనున్నారన్నారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రవాణా, నివాసం, వైద్య సదుపాయాలు తదితర అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం మంత్రి హజ్ కమిటీ సభ్యులు, అధికారులతో కలిసి భోజనం చేశారు. ఎస్ఎమ్ కన్వెన్షన్ పరిశీలనలో మంత్రివెంట మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి చిత్తూరి శ్రీధర్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ భాషా, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ఎండి ఫరూక్ షిబ్లి, ఏపీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్, ఏపీ స్టేట్ షేక్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ చైర్మన్ షేక్ ముక్తియార్, హజ్ కమిటీ సభ్యులు, హజ్ కమిటీ సీఈవో గౌస్ పీర్ ఉన్నారు.

**హజ్ యాత్రికుల కోసం సమగ్ర సదుపాయాలు -ప్రభుత్వం ప్రత్యేక చర్యలు**

హజ్ యాత్రికుల ప్రయాణాన్ని సౌకర్యవంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హజ్ కమిటీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేసింది. గన్నవరంలోని ఎస్ఎమ్ కన్వెన్షన్ సెంటర్ వద్ద మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన హజ్ యాత్రికుల కోసం కన్వెన్షన్ సెంటర్‌లో ప్రత్యేక వసతి, భోజన ఏర్పాట్లు, తాగునీటి సౌకర్యం, విశ్రాంతి కోసం మంచాలు, ఎయిర్ కూలర్లు, మొబైల్ టాయిలెట్లు తదితర సౌకర్యాలు కల్పించారు.

యాత్రికులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఒకేచోట అందుబాటులో ఉండేలా ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకుంది. ఎయిర్‌పోర్ట్ నిబంధనలకు అనుగుణంగా లగేజ్ ప్యాకింగ్ చేసుకునేందుకు ప్రత్యేక సౌకర్యాలు, గుర్తింపు కార్డుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని కన్వెన్షన్ సెంటర్ మొత్తం ఎయిర్ కండిషనింగ్ సదుపాయాలతో సిద్ధం చేశారు.

ఈ ఏడాది హజ్ యాత్రికుల్లో 50 శాతం మహిళలు ఉండటం విశేషం. వారి సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని అదనపు సదుపాయాలు కల్పించారు. విదేశీ మారకద్రవ్య అవసరాల కోసం తాత్కాలిక బ్యాంక్ ఎక్స్ టెన్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అదనంగా, యాత్రికుల ఆరోగ్య భద్రత కోసం ప్రత్యేక వైద్య కేంద్రం, భద్రత కోసం పోలీసుల పటిష్ట బందోబస్తు, వివిధ శాఖల సమన్వయంతో సమగ్ర ఏర్పాట్లు చేపట్టడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్ హజ్ యాత్రికులతో సమావేశం నిర్వహించి వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. హజ్ యాత్రలో పాటించాల్సిన నియమాలు, పవిత్ర ప్రదేశాలలో అనుసరించాల్సిన విధానాలపై హజ్ కమిటీ ద్వారా యాత్రికులకు సమగ్ర శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. 40 నుండి 45 రోజుల పాటు సాగే ఈ పవిత్ర యాత్రలో యాత్రికులందరూ ఆరోగ్యంగా ఉండి సురక్షితంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. హజ్ యాత్రికులు శిబిరం నుంచి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకునేందుకు ప్రత్యేక ఏసీ బస్సులను ఏర్పాటు చేశారు.



## లోకేష్‌కు జనార్ధన్ రెడ్డి అభినందనలు

అమరావతి (చైతన్య రథం): టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన నారా లోకేష్‌కు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అభినందనలు తెలిపారు. నేడు ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో విద్యా, ఐటీ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి జనార్ధన్ రెడ్డి.. లోకేష్‌కు వేంకటేశ్వర స్వామి ప్రతిమనిచ్చి ఆత్మీయ అభినందనలు తెలిపారు. తెలుగుదేశం పార్టీలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పొలిట్ బ్యూరోలో తనకు అవకాశం కల్పించడంపైనా సంతోషం వ్యక్తం చేస్తూ.. అందుకు సహకరించిన మంత్రి లోకేష్‌కు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



# హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్‌కు ఘన వీడ్కోలు

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి శ్రీనివాస్‌కు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలో ఫుల్‌బెంచ్ ఘన వీడ్కోలు పలికింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్ పదవీ విరమణ చేయనున్న సందర్భాన్ని పురస్కరించుకుని వీడ్కోలు కార్యక్రమం హైకోర్టు మొదటి కోర్టు హాల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ జస్టిస్ వి శ్రీనివాస్ నిబద్ధత కలిగిన న్యాయమూర్తని కొనియాడారు. జస్టిస్ వి శ్రీనివాస్ కృష్ణాజిల్లా తిరువూరులో లక్ష్మణరావు, సుశీలాకుమారి దంపతులకు ఏప్రిల్ 18, 1964లో జన్మించారని,1988వ సంవత్సరంలో నూజివీడు బార్ కౌన్సిల్ సభ్యుడిగా, న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారని తెలిపారు. ఆగస్టు 4, 2022న హైకోర్టు న్యాయమూర్తిగా నియమకం అయ్యారని తెలిపారు. జస్టిస్ వి శ్రీనివాస్ తన పదవీకాలంలో అనేక కీలకమైన తీర్పులను వెలువరించారని, న్యాయ వ్యవస్థకు విశేష సేవలు అందించారని కొనియాడారు. జస్టిస్ శ్రీనివాస్ జిల్లా మరియు సెషన్స్ జడ్జీగా, రిజిస్ట్రార్‌గా వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. పదవీ విరమణ అనంతరం జస్టిస్ శ్రీనివాస్ శేష జీవితం ఆయురారోగ్యాలతో ప్రశాంతంగా గడవాలని కోరుకుంటున్నానని ప్రధాన న్యాయమర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ అన్నారు. అనంతరం అడిషినల్ సోలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ్, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభునాథ్ వాసిరెడ్డిలు జస్టిస్ శ్రీనివాస్‌కు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలుపుతూ తమ అనుభవాలను పంచుకున్నారు. పదవీ విరమణ చేస్తున్న జస్టిస్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో తనకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తన విద్యార్థి దశనుండి న్యాయవాదిగా, న్యాయమూర్తిగా ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి ప్రతి దశలోనూ ఉత్తమ సలహాలు అందించిన పెద్దలకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, అదనపు అడ్వకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనారాయణ, న్యాయవాదులు.. జస్టిస్ శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు.






### జనగణనలో ప్రజా భాగస్వామ్యం

# దేశాభివృద్ధికి బలమైన పునాది

- ఆత్మకూరులో సెల్ఫ్ ఎన్యూమరేషన్ పూర్తిచేసిన మంత్రి ఆనం
- ప్రజలందరూ పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపు



ఆత్మకూరు (చైతన్య రథం): దేశ ప్రగతికి జనగణన అత్యంత ఆవశ్యకమని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం సాయంత్రం ఆత్మకూరులో జనగణన కార్యక్రమంలో భాగంగా సెల్ఫ్ ఎన్యూమరేషన్ పూర్తి చేసిన మంత్రి.. 33 ప్రశ్నలతో కూడిన ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా జనగణనలో పాల్గొన్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని జిల్లా కలెక్టర్ తరపున ఆత్మకూరు ఆర్డీవో పావని, తహసీల్దార్ పద్మజ ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ఆర్థిక సంస్కరణలు, పేదల అభ్యున్నతికి జనగణన కీలకమన్నారు. 2011 తర్వాత మళ్లీ ఎన్డీఏ ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జనగణన ప్రారంభించడం శుభపరిణామమన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సహా ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని అంటూ.. దేశంలోని మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న ప్రతి వ్యక్తీ తమ కుటుంబ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. దేశ జనాభా లెక్కలు సక్రమంగా నమోదు కావడం ద్వారా అభివృద్ధి ప్రణాళికలు, యువతకు ఉపాధి అవకాశాలు, పరిశ్రమల స్థాపనకు దోహదపడుతాయని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ దేశాల్లో మన దేశ స్థానాన్ని సుస్థిరం చేయడానికి ఈ జనగణన కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి ఆకాంక్షించారు. ప్రజలందరూ పెద్దఎత్తున జనగణనలో పాల్గొని దేశాభివృద్ధికి దృఢమైన పునాది వేయాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కోరారు. ఈనెల 30 వరకూ ప్రజలు స్వయంగా ఆన్‌లైన్‌లో తమ ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించామని మంత్రి తెలిపారు. మే 1నుంచి 30వరకూ ఎన్యూమరేషన్ అధికారులు ఇంటింటికి వెళ్లి భౌతికంగా ఇళ్ల గణన ప్రక్రియను చేపడతారన్నారు.

# పారదర్శకత, నాణ్యతలో రాజీ వద్దు

- ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశం
- రూ.29,042 కోట్ల ఆదాయం సాధించినా.. అప్రమత్తత అవసరం
- మీడియా వార్తలపై తక్షణం స్పందించాలని అధికారులకు ఆదేశాలు



అమరావతి (చైతన్య రథం): “ఆదాయంలో అత్యంత కీలకమైన ఎక్సైజ్ శాఖలో పారదర్శకత, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ ఉండకూడదు” అని ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖపై శుక్రవారం నిర్వహించిన సమీక్షలో అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రిన్సిపల్ సెక్రటరీ (రెవెన్యూ- ఎక్సైజ్) ముఖేష్ కుమార్ మీనాతో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అన్ని చర్యలను కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని, ఎక్కడైనా లోపాలు కనబడితే చర్యలు తీసుకొనేందుకు వేనుకాడవద్దని స్పష్టం చేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలపై తక్షణమే స్పందించి, వాస్తవాలను ధృవీకరించి అవసరమైతే రిజాయిండర్లు విడుదల చేయాలని స్పష్టం చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 29,042 కోట్ల ఆదాయం సాధించినందుకు మంత్రి అధికారులను అభినందించారు. లిక్కర్‌లో కల్తీ, అక్రమ అమ్మకాలు జరగకుండా పర్మిట్ రూమ్స్, షాపులు, బార్లు, ఇన్-హౌస్ ఎస్టాబ్లిష్‌మెంట్లపై తరచుగా తనిఖీలు నిర్వహించాలని, ఎక్కడైనా ఉల్లంఘనలు కనిపిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐఎంఎఫ్ఎల్ , విదేశీ మద్యం నాణ్యత తనిఖీ కోసం ర్యాండమ్ సాంప్లింగ్‌కు సంబంధించి స్పష్టమైన ఎస్ఓపి రూపొందించి కచ్చితంగా అమలు చేయాలని చెప్పారు. అలాగే రాబోయే ఎక్సైజ్ పాలసీ కోసం ఇప్పటినుంచే సన్నాహాలు ప్రారంభించి, పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను తదుపరి గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సమావేశంలో పెట్టాలని మంత్రి ఆదేశించారు. సమావేశానికి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డైరెక్టర్ చామకూరి శ్రీధర్, ఇతర ఉన్నతాధికారులు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ ప్రతినిధులు హాజరయ్యారు.

# కృషికి తగిన ఫలితం!

### లోకేష్‌కు ఉన్నత పదవిపై హర్షాతిరేకాలు



గుంటూరు (చైతన్య రథం): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వడంపై యావత్ ఏపీ యువత హర్షం వ్యక్తం చేస్తోంది. ఇందులో భాగంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ టీడీపీ స్టూడెంట్ యూనియన్, ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో నారా లోకేష్‌కు గురుతర బాధ్యతలు అప్పగించిన పార్టీ జాతీయాధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ గౌంవాధ్యక్షుడు అట్లూరి నారాయణరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ నారా లోకేష్‌కు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి రావడం చాలా శుభ పరిణామమన్నారు. భారతదేశంలో అనేక ప్రాంతీయ పార్టీలున్నప్పటికీ, అనేక పార్టీలలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఉన్నప్పటికీ.. ఆ పదవులు వారికి తాతల దీవెనలతోనూ లేదా తండ్రులు ఆశీస్సులతో వచ్చిన పదవులే కానీ ఎవరికీ కష్టపడి సాధించిన పదవులు కాదని వ్యాఖ్యానించారు. కానీ, నారా లోకేష్‌కు వచ్చిన పదవి.. ఆయన పదహారేళ్ల కష్టానికి దక్కిన గౌరవమన్నారు. పార్టీ కోసం లోకేష్ ఎదుర్కొన్న అవమానాలు, కష్టాల గాయాలకు ఇదొక ఔషధమని ప్రస్తావించారు. “తెలుగుదేశం పార్టీకి గెలుపులేని మంగళగిరిని ఎంచుకుని... ఇక్కడే నిలబడి గెలిచి తీరుతానని ఆయన పెట్టుకున్న కసికి 2024లో దక్కిన గౌరవం అందరం చూసాం. అలానే 2019-2024 ముందు ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యమేలిన రాక్షసులను అంతమొందించేందుకు యువగళం రథసారధిగా ముందుండి తెలుగుదేశం నాయకులందరినీ నడిపించి ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం సాధించిన విజయానికి తొలిమెట్టుగా లోకేష్ నిలిచారన్నారు. ఆయన పడిన కష్టానికి ఇది ఒక గౌరవం అని పేర్కొన్నారు. లోకేష్ తనకి దక్కిన పదవితో కేవలం ఏపీలోనే కాదు, యావత్ దేశంలోనే ఉత్తమ యువ రాజకీయ నాయకుడిగా ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ.. పదవిని నారా లోకేష్‌కు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ధన్యవాదాలు తెలిపారు. ఈ పదవి ద్వారా మరిన్ని శిఖరాలు అధిరోహించాలని నారా లోకేష్‌కు అట్లూరి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి లోకేష్‌కు ఇవ్వడంపట్ల హర్షం వ్యక్తం చేస్తూ.. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీ రామారావు విగ్రహానికి పాలాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ మరియు టిఎన్టియుసీ నాయకులు మండూరి వెంకటరమణ, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు బత్తుల హేమంత్ కుమార్, విశ్వవిద్యాలయం ఉద్యోగులు రాధాకృష్ణ, టీఎన్టీయూసీ నాయకులు నంబూరు కోటేశ్వరరావు తదితర నాయకులు, పార్టీ కార్యకర్తలు విద్యార్థులు ఉద్యోగస్తులు పెద్దఎత్తున పాల్గొని లోకేష్‌కు అభినందనలు తెలిపారు.

# అంగరంగ వైభవంగా పెంచలకోన బ్రహ్మోత్సవాలు

- సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ దర్శన ఏర్పాట్లు
- అధికారులందరూ సమర్థవంతంగా పనిచేయాలి
- బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఫెస్టివల్ కమిటీని నియమించాం
- త్వరలోనే రాష్ట్ర పండుగగా పెంచలకోన బ్రహ్మోత్సవాల నిర్వహణ
- సీఎం ఆదేశాల మేరకు ప్రతి ఆలయాన్నీ అభివృద్ధి చేస్తున్నాం
- రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



పెంచలకోన (చైతన్య రథం): పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 27నుంచి మే 3వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల కోసం అన్ని శాఖలు ముందుగానే సిద్ధంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. ఈ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి వెల్లడించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారి దర్శనం ప్రశాంతంగా జరిగేలా క్యూలైన్లు, బారికేడింగ్, ట్రాఫిక్, పార్కింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని, పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. స్త్రీశక్తి పథకంవల్ల మహిళా భక్తుల సంఖ్య పెరిగే అవకాశమున్నందున ఆర్టీసీ అధికారులు అధిక సంఖ్యలో బస్సులు నడపాలని ఆదేశించారు. విద్యుత్, పోలీస్, ఫైర్, మెడికల్, ఆర్ అండ్ బి, మున్సిపల్, పంచాయతీ శాఖల అధికారులు భక్తుల అవసరాల మేరకు అన్ని సదుపాయాలు కల్పించాలని, అగ్నిమాపక వాహనాలు, 108 అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. భక్తులకు తాగునీరు, అన్నదానం సౌకర్యాలు కల్పించడంతోపాటు నిరంతర వైద్య సేవల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. హనుమంతుని సేవ, గరుడ సేవ, కళ్యాణ ఉత్సవం రోజుల్లో భక్తులకు ఉచితంగా లడ్డూ ప్రసాదం పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. కాణిపాకం, శ్రీశైలం, శ్రీకాళహస్తి, మాలకొండ, కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాల తరపున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.832 కోట్లు మంజూరు చేశారని, టిటిడి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.750 కోట్లతో ఐదువేలకుపైగా భజన మందిరాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి నిబద్ధతతో పనిచేస్తున్నారని, ఈనెల 16న రాష్ట్ర సచివాలయంలో సుమారు మూడు గంటలకు పైగా దేవాదాయ శాఖపై సీఎం సమీక్షించి ఆలయాల అభివృద్ధికి కీలకమైన ఆదేశాలు ఇచ్చారని మంత్రి వెల్లడించారు.

పెంచలకోన శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి ఇటీవల రూ.6.50 కోట్లు మంజూరు చేసినట్లు, బ్రహ్మోత్సవాల అనంతరం పనులు ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణంపైనా ఇంజనీరింగ్ అధికారులు, ఆగమ పండితులతో సంప్రదించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తన నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎన్నడూ లేని విధంగా బ్రహ్మోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి పేర్కొన్నారు.

వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచనల మేరకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. మంత్రి సహకారంతో ఆలయాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయంతో పాటు లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని కూడా పునర్ నిర్మించాలని కోరుతూ మంత్రికి లేఖను అందించినట్టు చెప్పారు. సామాన్య భక్తులకు మంచి దర్శన భాగ్యం కల్పించాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. తొలుత ఆలయానికి విచ్చేసిన మంత్రి, ఎమ్మెల్యేకు వేద పండితులు, ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. సమావేశంలో నెల్లూరు ఆర్డీవో అనూష, దేవాదాయ శాఖ ఆర్‌జేసి ఆజాద్, జిల్లా దేవాదాయ శాఖ అధికారి జనార్దన్ రెడ్డి, ఫెస్టివల్ కమిటీ ఛైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రపంచస్థాయి గేమింగ్ హబ్‌గా భారత్

*- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆకాంక్ష*




చెన్నై ట్రేడ్ సెంటర్‌లో సీఐఐ, ఐడీజీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియా గేమింగ్ షో 6వ ఎడిషన్‌ను ప్రారంభించిన రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల మంత్రి మండిపల్లి రామప్రసాద్. అనంతరం ఎగ్జిబిషన్‌ను సందర్శించిన మంత్రి

విజయవాడ (చైతన్య రథం): గేమింగ్ రంగం యువతకు విస్తృత అవకాశాలు కల్పిస్తోందని, అలాంటి గేమింగ్ రంగంలో ప్రపంచస్థాయి హబ్‌గా భారత్ ఎదగాలని రవాణా మంత్రి మండిపల్లి రామప్రసాద్ ఆకాంక్షించారు. చెన్నై ట్రేడ్ సెంటర్‌లో సీఐఐ, ఐడీజీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియా గేమింగ్ షో 6వ ఎడిషన్‌ను మంత్రి ప్రారంభించారు. గేమింగ్, ఈ–స్పోర్ట్స్ పరిశ్రమకు సంబంధించిన ఎగ్జిబిషన్‌ను సందర్శించి, ఆధునిక సాంకేతికతలు, కొత్త ట్రెండ్స్‌పై ఆసక్తి వ్యక్తం చేశారు. అనంతరం దేశ విదేశీ ప్రతినిధులతో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గేమింగ్ రంగం యువతకు విస్తృత అవకాశాలు కల్పిస్తోందని, టెక్నాలజీ ఆధారిత అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. గేమింగ్ షో నిర్వాహకులు ఐడీజీఎస్ అధ్యక్షులు రాజన్ నవానీ, వైస్ ప్రెసిడెంట్ సీన్ సోన్‌లను మంత్రి అభినందించారు. అలాగే ఐడీజీఎస్ సెక్రటేరియట్ సభ్యులు సుభాష్ సర్పు, మధురిమ మణియర పాల్గొన్నారు. గేమింగ్ రంగ అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు మరింత దోహదం చేస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆత్మకూరులో ప్రతిష్టాత్మకంగా ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

*- భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్న మంత్రి ఆనం*



నెల్లూరుపాళెం (చైతన్య రథం): విభజిత రాష్ట్రాభివృద్ధికి కంకణబద్ధుడై శ్రమిస్తున్న అభివృద్ధి ప్రదాత, దార్శనికుడు చంద్రబాబును గౌరవించుకోవడం కోసం ఆయన జన్మదిన వేడుకలను ఆత్మకూరులో పండుగలా నిర్వహించనున్నట్టు దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రకటించారు. ఐదు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎన్నో కష్టనష్టాలను చవిచూసి ధీరోదాత్తుడిగా తెలుగుదేశం పార్టీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న నాయకుడిని సమున్నతంగా సత్కరించకోవడానికి ఇంతకంటే మంచి సమయం ఏముంటుందన్నారు. నెల్లూరుపాళెం –ఆత్మకూరు రోడ్డులో ఏఎంసీ ఎదురుగావున్న మైదానంలో రాజగోపురం సెట్, ప్రత్యేక హోమాలు, వివిధ కార్యక్రమాల ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి.. మీడియాతో కొద్దిసేపు మాట్లాడారు. "ఈనెల 20న ఆత్మకూరులో పెద్ద పండుగలా సీఎం నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు జరుపుతున్నాం" అన్నారు. సీఎం జన్మదిన ఏర్పాట్లపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన మంత్రి ఆనం.. "ఆత్మకూరు పట్టణంలో సీఎం జన్మదినాన చంద్రబాబు ఆయురారోగ్యం కోసం వేద పండితులతో ప్రత్యేక హోమాలు నిర్వహించనున్నాం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని, రాష్ట్రాన్ని సుపరిపాలనవైపు నడిపించేందుకు భగవంతుడు శక్తియుక్తులు, సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుతూ ప్రత్యేక హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తాం. కార్యక్రమానికి పార్టీ శ్రేణులంతా ఉత్సాహంగా సిద్ధం కావాలి. పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతి ఒక్కరినీ మర్యాదపూర్వకంగా ఆహ్వానిస్తున్నాం. బూత్ కమిటీలు, గ్రామ, మండల కమిటీలు, క్లస్టర్ కమిటీలు, యూనిట్ కమిటీల సభ్యులందరూ గ్రామ గ్రామాన అందరినీ సీఎం జన్మదిన వేడుకలకు ఆహ్వానించాలి. చంద్రబాబు నాయకత్వంలో ఒకటిన్నర సంవత్సరం కాలంలో ఎన్నో విజయాలు సాధించాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శాశ్వత రాజధానిగా అమరావతిని చరిత్రలో నిలిపిన ఘనత చంద్రబాబుకే దక్కింది. ఎన్డీయే కూటమి అధినేతగా చంద్రబాబు సారధ్యంలో సాధించిన విజయాలతో ఆయన జన్మదిన వేడుకలకు కూటమి నేతలు అందరూ సిద్ధం కావాలి" అని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు.



# టౌన్ ప్లానింగ్‌తో మంత్రి నారాయణ టెలికాన్ఫరెన్స్

అమరావతి (చైతన్య రథం): టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో మంత్రి నారాయణ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు అనుమతులపై సమీక్షించారు. టెలికాన్ఫరెన్స్ మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణకు అర్హత ఉన్న అన్ని దరఖాస్తులను వెంటనే ఆమోదించాలని ఆదేశించారు. వెంటనే పెండింగ్ అప్లికేషన్లు క్లియర్ చేయాలని సూచించారు. లేఅవుట్ క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 23తో ముగుస్తుందని తెలిపారు.

# సూర్యఘర్‌తో నిరంతర వెలుగులు

- రాష్ట్ర వ్యాప్తంగా 6 లక్షల ఉచిత సూర్యఘర్ కనెక్షన్లు మంజూరు
- విద్యుత్ రంగంలో మౌలిక వసతుల కల్పనకు కూటవి కృషి
- వచ్చే సీజన్‌కు పూర్తిస్థాయిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు
- రాయదుర్గంలో పీఎం సూర్యఘర్ ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి

రాయదుర్గం (చైతన్య రథం): పీఎం సూర్యఘర్ ద్వారా పర్యావరణ పరిరక్షణతోపాటు వినియోగదారులకు విద్యుత్ భారంతగ్గి, నిరంతరాయంగా విద్యుత్ అందుతుందని ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాళ్ మండలం నేమకల్లు గ్రామంలోని కాలనీలో 'ప్రధాన మంత్రి సూర్యఘర్ –ముఫ్త్ బిజిలీ యోజన' పథకాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రగతి పండుగ' కార్యక్రమంలో పాల్గొని రూ.30 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ... పేద వర్గాలకు లబ్ధి చేకూర్చాలన్న సంకల్పంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం సూర్యఘర్ కార్యక్రమాన్ని రూపొందించాయన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో 'పీఎం సూర్యఘర్' పథకం ద్వారా రూ.27 కోట్ల వ్యయంతో 2400 ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉచిత సోలార్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఈ పథకం ద్వారా అయ్యే రూ.1.25 లక్షల ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే భరిస్తూ పూర్తి ఉచితంగా అందిస్తున్నాయని పేర్కొన్నారు. అంతేగాకుండా ఈ పథకం ద్వారా ఓసీ వినియోగదారులకు రూ.78,000, బీసీలకు రూ.98,000 రాయితీ అందిస్తున్నామని అన్నారు. విద్యుత్ రంగంలో సమగ్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి



గొట్టిపాటి రవి పేర్కొన్నారు. ముఖ్యంగా పునరుత్పాదక శక్తి వినియోగాన్ని పెంచేందుకు, రాష్ట్రం వ్యాప్తంగా 6 లక్షల ఉచిత సూర్యఘర్ కనెక్షన్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజలు స్వయం సమృద్ధిగా ఉత్పత్తి చేసి విద్యుత్ వినియోగించుకునేలా ఇది ఒక కీలక ముందడుగు అని స్పష్టం చేశారు. ఈ వేసవి నాటికి ఈ 6 లక్షల సూర్యఘర్ కనెక్షన్లను పూర్తిగా అందుబాటులోకి తీసుకురావడం మా లక్ష్యంగా అధికార యంత్రాంగం పని చేస్తోందని మంత్రి చెప్పారు. అలాగే, లో వోల్టేజ్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం అందించేందుకు రాయదుర్గంలో 3 కొత్త సబ్ స్టేషన్లను మంజూరు చేశామని అన్నారు. ఇవి పూర్తయిన తర్వాత అక్కడి ప్రజలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుంది. ఆర్డీఎస్ఎస్ పథకం కింద నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, పాత విద్యుత్ స్తంభాల మార్పిడి వంటి పనులు విస్తృతంగా చేపడుతున్నట్లు వివరించారు. దీని ద్వారా విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా రైతుల కోసం, వచ్చే సీజన్ నాటికి వ్యవసాయ విద్యుత్ సర్వీసులను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ అందేలా కృషి చేస్తున్నాం.

"ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మహానేత. ఆయన ఆరోగ్యంగా, దీర్ఘాయుష్షుతో ఉండటం రాష్ట్ర ప్రజలందరికీ అత్యంత ముఖ్యం. సీఎం మరో 15 ఏళ్లపాటు ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తూ, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు నిర్వహిస్తున్న హోమాలు, పూజలు, ప్రగతి పండుగ కార్యక్రమాలు నిజంగా ఆదర్శప్రాయం. రాష్ట్రంలో ఇలాంటి కార్యక్రమాలు ఎవరూ నిర్వహించలేదు. ఇలాంటి గొప్ప ఆలోచన రావడం అభినందనీయం. ఈ కార్యక్రమాలు ఆ మహానాయకుడిపై ప్రజలకు ఉన్న అపారమైన విశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నాయి. రాయదుర్గం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు నిరంతరం శ్రమిస్తున్నారు. గత ఎన్నికల్లో జిల్లాలోనే అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. రాబోయే ఎన్నికల్లో మరింత రెట్టింపు మెజారిటీ సాధించాలని ఆకాంక్షిస్తున్నా' అని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ.... రాష్ట్ర అభివృద్ధే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాన సంకల్పమని అన్నారు. ఆయన సహకారంతో గత 22 నెలల్లో రాయదుర్గం అభివృద్ధికి సుమారు రూ.800 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో మరే నియోజకవర్గానికి ఇవ్వనన్ని నిధులు రాయదుర్గానికి కేటాయించినందుకు కృతజ్ఞతగా 10 రోజుల పాటు చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రూ.400 కోట్లు, రాయదుర్గం పట్టణ మంచినీటి అవసరాల కోసం రూ.78 కోట్లు కేటాయించారని వివరించారు. ముఖ్యమంత్రి క్షేమం కోరుతూ జంబుకేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక హోమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయన నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందనే నమ్మకం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

**అపూర్వ స్వాగతం..**

నేమకల్లు గ్రామంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తదితరులకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గ్రామంలోకి ప్రవేశించగానే భారీఎత్తున బాలసంచా కాల్చుతూ, పూలాభిషేకంతో స్వాగతం పలికారు. మరోవైపు ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించి అభిమానాన్ని చాటుకున్నారు. ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులకు ఆలయ పండితులు, నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి దీవెనలు తీర్థప్రసాదాలు అందజేశారు.

## మహిళా శక్తి అభివృద్ధే

# ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం

- మహిళా రిజర్వేషన్ బిల్లుతో దేశం సంతోషంగా ఉంది..
- ఒక్క వైసీపీ నేతలే విషం చిమ్ముతున్నారు..
- నిన్నటి వరకు విలన్లుగా ఉన్న జగన్ బ్యాచ్..
- ఇప్పుడు మాటలతో జోకర్లని నిరూపించుకుంటున్నారు
- మహిళలపై వైసీపీ దాష్టీకాలకు ఎన్సీఆర్బీ నివేదిక చాలు
- అమరావతికి భూములిచ్చిన ఆడబిడ్డలను రోడ్లకీడ్చిన చరిత్ర మీది
- వీరమహిళలను అశ్లీల పోస్టులతో వేధించిన సైకో బ్యాచ్ మీది కాదా?
- ఆస్తి కోసం తల్లిని గెంటేసిన జగన్ రెడ్డి.. మహిళా పక్షపాతి అవుతారా?
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే గౌతు శిరీష



మంగళగిరి (చైతన్య రథం): దేశవ్యాప్తంగా చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చారిత్రాత్మక బిల్లు వస్తుంటే.. కులమతాలకు అతీతంగా మహిళలందరూ పండగ చేసుకుంటున్న తరుణమిదని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కానీ ఆంధ్రరాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి, ఆయన సైకో బ్యాచ్ చేస్తున్న విమర్శలు చూస్తుంటే నవ్వాలో, ఏడవాలో అర్థం కావట్లేదని విమర్శించారు. ఇప్పటివరకు వీరిని విలన్లు అనుకున్నాం.. కానీ వీరు ఉత్త "జోకర్లు" అని కూడా ఈ మధ్య నిరూపించుకుంటున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మాజీ మంత్రి విడుదల రజిని ప్రెస్‌మీట్ పెట్టి తెలుగుదేశం వస్తే అకృత్యాలు జరుగుతున్నాయని పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు. "ఒక్కసారి గూగుల్ ఓపెన్ చేసి ఎన్‌సీఆర్బీ 2023 నివేదిక చూడండి. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో నేరాలు ఏస్థాయిలో చోటుచేసుకున్నాయో నివేదికే మాట్లాడుతుంది. దక్షిణాదిలో మనకంటే పెద్ద రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడును దాటి ఏపీని నేరాల్లో నంబర్ వన్ చేసిన ఘనత జగన్ రెడ్డిది కాదా?" అని నిలదీశారు. "దళితులు నా సోదరీసోదరులు" అని జగన్‌రెడ్డి ఆస్కార్‌స్థాయి నటన ప్రదర్శిస్తారని, కానీ దేశంలోనే దళితులపై నేరాలు, అకృత్యాలు జగన్ హయాంలోనే ఆంధ్రప్రదేశ్ టాప్ పొజిషన్‌లో ఉందని గణాంకాలు చెబుతున్నాయన్నారు. 'ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో జగన్ హయాం దారుణ వైఖరి ప్రదర్శించారు. రజినీ, మీ హయాంలో జరిగిన నేరాల చిట్టా తీస్తే మీ ముఖం ఎక్కడ పెట్టుకోవాలో మీరే ఆలోచించుకోవాలి. చంద్రబాబు పాలనకి, జగన్‌రెడ్డి గందరగోళ పాలనకి నక్కకీ నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. ఎన్టీఆర్ ఆడపిల్లకు ఆస్తిలో సమాన హక్కు కల్పించి, తెలుగు ఇంటి ఆడపడుచులకు దైవం అయ్యారు. చంద్రబాబు.. డ్వాక్రా సంఘాల ద్వారా కోటిమంది మహిళలకు ఆర్థిక సాధికారత కల్పించారు. స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్లు ఇచ్చి మహిళలను మహారాణులను చేశారు. అమరావతి కోసం భూములిచ్చిన మహిళలపట్ల జగన్ సర్కార్ ఎంత క్రూరంగా ప్రవర్తించిందో ప్రపంచం మొత్తం చూసింది. శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న మహిళల మీద డ్రోన్లు తిప్పడం, వారిని నడిరోడ్డుపై వేధించడం మర్చిపోయారా? సొంత తల్లికి, సొంత చెల్లికి కనీసం గౌరవం ఇవ్వని జగన్‌రెడ్డి, రాష్ట్ర మహిళలకు మేలు చేశామని చెప్పుకోవడం ఈ శతాబ్దపు అతిపెద్ద జోక్. వైసీపీ సోషల్ మీడియా సైకోలతో మహిళలపై ఎంత నీచంగా పోస్టులు పెట్టించారో అన్ని ఆధారాలూ మా దగ్గరున్నాయి. ఒక మహిళగా నేనూ బాధితురాలినే" అని శిరీష ధ్వజమెత్తారు.

ఆనాడు అమెరికా అధ్యక్షుడికి సమానంగా సామాన్య డ్వాక్రా మహిళను కూర్చోబెట్టి, ఏపీ మహిళాశక్తిని ప్రపంచానికి చాటిన చంద్రబాబుతో జగన్‌కు పోలికేంటని నిలదీశారు. మహిళలకు జగన్ ఇచ్చిన గౌరవం.. అమరావతి మహిళలను అడిగితే చెబుతారని దుమ్మెత్తిపోశారు. "దుర్గమ్మ దర్శనానికి వెళ్తుంటే మహిళలను అడ్డుకుని, కనీసం విస్తరాకులు లేకుండా రోడ్డుమీద అన్నం తినేలా చేసిన క్రూరమైన మనస్తత్వం మీది కాదా? తిరుమలకు పాదయాత్ర చేస్తుంటే, సర్వేపల్లి దగ్గర అప్పటి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డి చేసిన పనులు ఎంత నీచమైనవో రాష్ట్రమంతా చూడలేదా? అమరావతి ఆడబిడ్డలు బహిర్భూమికి వెళ్తుంటే అక్కడ కూడా డ్రోన్లు తిప్పిన నీచమైన చరిత్ర మీది. ఇంతటి దమనకాండ సాగించి, ఈరోజు మళ్లీ ప్రెస్‌మీట్లు పెట్టి మహిళల గురించి మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుతున్నారు. మీ అసత్యాలను, అరాచకాలను మహిళా లోకం ఎన్నటికీ క్షమించదు. నిజమైన మహిళా పక్షపాతి ఎవరో, మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన సైకోలు ఎవరో ప్రజలకు స్పష్టంగా తెలుసు" అని ఎమ్మెల్యే శిరీష ధ్వజమెత్తారు.

"మహిళలపట్ల గౌరవం విషయంలో చంద్రబాబకి ఉన్న సంస్కారం జగన్ లేదు. జగన్‌రెడ్డి భార్యమీద తప్పుడు పోస్ట్ పెడితే.. ఏ పార్టీ కార్యకర్త అని కూడా చూడకుండా చంద్రబాబు శిక్షించారు. మహిళంటే ప్రత్యర్థి పార్టీకి చెందిన వారైనా గౌరవించాలనే గొప్ప సంస్కారం చంద్రబాబుది. అదీ తెలుగుదేశం క్రమశిక్షణ. కనీసం కన్న తల్లికి, తోడబుట్టిన చెల్లికి మీరిచ్చే గౌరవం ఏమిటో రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారు. సొంత రక్తసంబంధీకులనే గౌరవించని మీరు, రాష్ట్రంలోని మహిళలకు 90 శాతం మేలు చేశామని మాజీ మహిళా మంత్రులతో అబద్ధాలు చెప్పిస్తే నమ్మడానికి ఎవరూ సిద్ధంగా లేరు. లక్షల ఫేక్ అకౌంట్లు పెట్టుకుని మహిళల ఆత్మగౌరవంతో ఆడుకున్న మీకు రోజులు దగ్గర పడ్డాయి. మహిళా బిల్లు వస్తున్న ఈ వేళలో కూడా డ్రామాలు ఆపకపోతే ప్రజలే మీకు బుద్ధి చెబుతారు" అని శిరీష నిప్పులు చెరిగారు. ఈరోజు కూటమి ప్రభుత్వంలో ముగ్గురు మహిళా మంత్రులకు అత్యంత ప్రాముఖ్యత కలిగిన శాఖలిచ్చి, పూర్తి స్వేచ్ఛతో పని చేయమని భుజంతట్టి పంపిన గొప్ప నాయకుడు చంద్రబాబు నాయుడు. ఆనాడే దళిత మహిళ ప్రతిభా భారతిని స్పీకర్‌ని చేసిన చరిత్ర తెలుగుదేశానికి. 33 శాతం రిజర్వేషన్ ఈరోజు వస్తుండొచ్చు కానీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అనే తేడా లేకుండా ప్రతి వర్గాన్ని గుండెలకు హత్తుకుంది తెలుగుదేశం పార్టీ. మీడియా ముందుకు వచ్చి మొసలి కన్నీరు కార్చే ఈ వైసీపీ నేతల అబద్ధాలను నమ్మకండి. మా దగ్గర ప్రతి నిందకూ సాక్ష్యం ఉంది. ప్రతి అరాచకానికి ఆధారాలు ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ మహిళల ఆత్మగౌరవం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం కట్టుబడి ఉంటుందని ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు.

చైతన్యరథం

# ఆర్టీజీఎస్ సీసీటీవీ 360... నమ్మికైన నేస్తం

- ప్రజల భద్రతకు భరోసా ఇస్తున్న సర్వైలెన్సు వ్యవస్థ
- రోజుల వ్యవధిలోనే ముగ్గురు బాలల ఆచూకీ కనుగొన్న సీసీకెమెరాలు
- యలమంచిలిలో ఇద్దరు, అనంతపురంలో ఒకర్ని కనిపెట్టిన కెమెరాలు
- తప్పిపోయిన చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



అమరావతి (చైతన్య రథం): ప్రభుత్వం ఏర్పాటు చేసిన సర్వీ లెన్సు కెమెరాలు ప్రజా భద్రతకూ భరోసా కల్పించే దిశగా కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇంటినుంచి తప్పిపోయిన చిన్నారుల ఆచూకీ కనిపెట్టి, వారిని కుటుంబసభ్యులకు అప్పగించడంలో ఆర్టీజీఎస్‌లోని సీసీటీవీ 360 వ్యవస్థ పోలీసులకు కీలక సహకారం అందిస్తోంది. రోజుల వ్యవధిలోనే ఇలా తప్పిపోయిన ముగ్గురు చిన్నారుల ఆచూకీ కనుగొనడంలో పోలీసులకు సీసీటీవీ 360 వ్యవస్థ సహకరించి ఆ పిల్లలను వారి కుటుంబసభ్యుల చెంతకు మళ్లీ చేరేలా తోడ్పాటు అందించింది.

అనకాపల్లి జిల్లా యలమంచిలి పట్టణంలో తప్పిపోయిన ఇద్దరు బాలురను ఆర్టీజీఎస్ సీసీటీవీ 360 సహకారంతో పోలీసులు రియల్ టైములో కనిపెట్టి.. పిల్లలను వారి కుటుంబీకులకు అప్పగించిన సంఘటన ఇది. ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న ఇద్దరు బాలురు స్నేహితులు. వీరు కనిపించకుండా పోయారని 15వ తేదీ యలమంచిలి పోలీసులకు వారి తల్లింద్రుల నుంచి ఫిర్యాదు అందింది. దీనిపై స్పందించిన పోలీసులు వీరి ఆచూకీ కనుగొనడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడంతోపాటు సీసీ కెమెరాల ద్వారా వీరి ఆచూకీని కనుగొని సహకారం అందించాలని పోలీసులు ఆర్టీజీఎస్‌లోని సీసీటీవీ 360 విభాగాన్ని కోరారు. తప్పిపోయిన బాలురకు సంబంధించి పోలీసులు ఇచ్చిన ఫొటోలను ఆర్టీజీఎస్ సీసీటీవీ 360లో అప్‌లోడ్ చేశారు. వీటిని ఏఐ ఆధారిత సీసీ కెమెరాల ద్వారా విశ్లేషిస్తూ ఈ బాలుర కదలికలను రియల్ టైములో ట్రాక్ చేసి కనుగొన్నారు. ఈ ఇద్దరు విశాఖపట్నం నగరంలో ఉన్నట్టుగా అక్కడి సీసీ కెమెరాలు గుర్తించి ఆర్టీజీఎస్ సీసీటీవీ 360 ద్వారా పోలీసులకు రియల్ టైములో అలర్టులు పంపాయి. విశాఖనగరంలో వీరిద్దరూ ఫలాన చోటున ఉన్నారనే సమాచారం అందించాయి. దీంతో పోలీసులు అప్రమత్తమై అక్కడికి చేరుకుని ఆ ఇద్దరు చిన్నారులను పట్టుకుని వారిని కుటుంబసభ్యులకు తిరిగి అప్పగించారు.

అనంతపురంలో జిల్లాలోనూ ఇలాగే తప్పిపోయిన బాలుడిని ఆర్టీజీఎస్ సీసీటీవీ 360 సాంకేతిక సహకారంతో పోలీసులు సకాలంలో పట్టుకుని వారి కుటుంబ సభ్యలకు తిరిగి అప్పగించగలిగారు. అనంతపురం పట్టణంలో తమ బిడ్డ తప్పిపోయాడని బాలుడి తల్లిదండ్రులు ఈనెల 11న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ పిల్లాడి ఆచూకీ కనుగొనడానికి ఆర్టీజీఎస్ సీసీటీవీ 360 విభాగం సహకరాం కోరారు. ఆ పిల్లాడికి సంబంధించిన ఫొటోని ఆర్టీజీఎస్ సీసీటీవీ 360లో అప్‌లోడు చేసి కదలికలను ఆన్‌లైన్‌లో ట్రాక్ చేశారు. సీసీటీవీ 360లోని పర్సన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (పీఓఐ) సాంకేతిక విశ్లేషణ ద్వారా ఆ బాలుడు హైదరాబాద్‌వైపు వెళుతున్నాడని ఆర్టీజీఎస్ రియల్ టైము అలర్టులను పోలీసులకు అందజేసింది. దీంతో పోలీసులు సకాలంలో ఆ బాలుడ్ని పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పగించగలిగారు.

### సత్ఫలితాలిస్తున్న సాంకేతికత

ఆర్టీజీఎస్‌లోని సీసీటీవీ 360 విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు సాంకేతిక తప్పిపోయిన వారి ఆచూకీ కనుగొనడంలో సత్ఫలితాలు సాధిస్తోంది. అలాగే రాష్ట్రంలో నేరస్థులను, చోరీకి గురైన వాహనాల ఆచూకీ కనుగొనడానికి కూడా ఇప్పుడు పోలీసులు ఈ సాంకేతిక సహకారాన్ని విరివిగా వినియోగించుకుంటున్నారు. కేసుల దర్యాప్తులో పోలీసులకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తూ ఆర్టీజీఎస్ సీసీటీవీ 360 విభాగం సత్ఫలితాలు సాధిస్తోంది.

### పరబ్రహ్మ స్వరూపాన్ని
# నేలపాల్జేసిన దుర్మార్గుడు!
**- గత జగన్ ప్రభుత్వ వైఖరిపై నిమ్మల ధ్వజం**



పాలకొల్లు (చైతన్య రథం): పేదల కడుపు నింపడానికి తెలుగుదేశం ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తే.. తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ –పేదల కడుపు కొట్టాడని ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాలకొల్లులో రూ.4.9 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 269 అన్న క్యాంటీన్‌లలో చంద్రబాబు రోజుకు 5 లక్షల మందికి ఐదు రూపాయలకే పేదల కడుపు నింపుతున్నారని మంత్రి నిమ్మల గుర్తు చేశారు. పేదల కడుపు నింపడంలో డొక్కా సీమత్త ఆదర్శాన్ని గుర్తు చేస్తూ.. ఆనాడే జగన్ ఉండి ఉంటే సీతమ్మను కూడా భోజనం పెట్టనిచ్చేవాడు కాదని దుయ్యబట్టారు. కాశీ అన్నపూర్ణలాంటి భోజనాన్ని రోడ్డుపై పారపోసిన జగన్‌కు రాజకీయాల్లో ఉండే అర్హత లేదన్నారు. పరబ్రహ్మ స్వరూపమైన భోజనాన్ని నేలపాలు చేసిన దుర్మార్గుడు జగన్ అంటూనే.. పేదవాడి నోటిదగ్గర కూడు లాక్కున్న గొడ్డలి పార్టీ రాష్ట్రానికి ఏం చేస్తుందని ప్రశ్నించారు. రూ.5లకు అన్నంపెట్టే అన్న క్యాంటీన్లను రద్దుచేసిన జగన్‌కు, ప్రజాస్వామ్యంలో పార్టీని నడిపే హక్కు లేదని దుయ్యబట్టారు. అన్న క్యాంటీన్‌లను జగన్ నిలిపివేస్తే, దాతలు ముందుకొచ్చి అన్నం పెట్టిన రోజులున్నాయని, అందుకు వాళ్లపైనా కేసులు పెట్టి అరెస్టులు సాగించిన ఘట్టాలను రాష్ట్రం మర్చిపోదని నిమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోవున్న ఐదేళ్లూ పేదలకు అన్నం పెట్టకపోగా, అన్నదానం చేసిన వాళ్లపై కేసులు పెట్టి వేధించిన ఘనులను ఏమనాలని ప్రశ్నించారు. పేదవాడు కడుపునింపని, మానవత్వంలేని జగన్ రాష్ట్రానికి అవసరం లేదని మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు.

# వినికిడి లోపానికి అత్యాధునిక వైద్యం

- జిల్లా, ఏరియా ఆసుపత్రుల్లో అత్యాధునిక పరికాలు
- సౌండ్ ప్రూఫ్ రూములు కూడా..
- సులువుగా వైకల్య నిర్ధారణ పరీక్షలు
- మంత్రి సత్యకుమార్‌కు నివేదించిన డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్









*పాలకొండ ఏరియా హాస్పిటల్‌లోని సౌండ్ ప్రూఫ్ రూమ్. అత్యాధునిక వైద్య పరికరాలు*

విజయవాడ (చైతన్య రథం): వినికిడి లోపం కలిగిన వారికి అత్యంత ఉన్నత వైద్యాన్ని కూటమి ప్రభుత్వం చేరువ చేస్తోంది. బెరా (బ్రెయిన్ స్టెమ్ ఏవోక్డ్ రెస్పాన్స్ ఆడియో మెట్రీ), ఇంపిడెన్స్ ఆడియో మెట్రీ, ప్యూర్ టోన్ ఆడియో మెట్రీ పరికరాలను అవసరమైన జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రుల్లో సమకూరుస్తోంది. వినికిడి లోపం కలిగినవారికి ఉన్నత వైద్యాన్ని అందించాలంటే ఈ మూడు రకాల పరికరాలు తప్పనిసరి. అయితే కొన్ని అసుపత్రుల్లో ఒకటి ఉంటే మరొకటి లేదు. మరికొన్నిచోట్ల అసలు లేవు. దీనివల్ల వినికిడి లోపం కలిగిన వారు ఉన్నత వైద్యం కోసం బోధనాసుపత్రులు, ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయిలోని పరిస్థితులపై అధ్యయనం చేసి, రోగుల అవసరాల మేరకు పరికరాలను ఆసుపత్రుల్లో సమకూర్చేందుకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలోనే సుమారు రూ.20 కోట్లతో బెరా, ఇంపిడెన్స్, ప్యూరోటోన్ ఆడియో మెట్రీ పరికరాలను స్థానిక అవసరాలకు అనుగుణంగా ఆసుపత్రుల్లో సమకూరుస్తున్నారు. అలాగే ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో సౌండ్ ప్రూఫ్ రూములను సైతం సిద్ధం చేస్తున్నారు. రోగులకు ఆసుపత్రుల్లో వీటిని అందుబాటులోనికి తెచ్చేందుకు తీసుకుంటున్న చర్యలపై డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారులు మంత్రి సత్యకుమార్‌కు నివేదించారు. వీటిని ఆసుపత్రుల్లో అందుబాటులోనికి తెచ్చే పనులు 80శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను మరో నెలలో పూర్తి చేస్తామని వివరించారు. సదరం కింద జరిగే వైకల్య నిర్ధారణ పరీక్షలకు ఈ పరికరాలు బాగా ఉపయోగపడనున్నాయి. బాధితుల వినికిడి లోపాన్ని సూక్ష్మస్థాయిలో గుర్తించి సర్టిఫికెట్లు జారీ చేసేందుకు వీలవుతుంది

### 8 ఆసుపత్రుల్లో తొలిసారిగా మూడు పరికరాలు సిద్ధం!

తెనాలి జిల్లా ఆసుపత్రి, నర్సీపట్నం (అనకాపల్లి జిల్లా), పాలకొండ (మన్యం), డోన్ (నంద్యాల), కందుకూరు (ప్రకాశం), కావలి (నెల్లూరు జిల్లా), చీపురుపల్లి (విజయనగరం), నర్సాపురం (పశ్చిమగోదావరి)లోని ఏరియా అసుపత్రుల్లో బెరా, ఇంపిడెన్స్, ప్యూర్ టోన్ ఆడియో మెట్రీ పరికరాలను అమర్చారు.

### 5 జిల్లా ఆసుపత్రులు, 34 ఏరియా ఆసుపత్రుల్లో రెండు వరికరాల చొప్పున!!

అనకాపల్లి, ప్రొద్దుటూరు, చిత్తూరు, ఆత్మకూరు, తణుకు జిల్లా ఆసుపత్రుల్లో బెరా, ప్యూర్ టోన్ ఆడియో మెట్రీ పరికరాలను అమర్చారు. అలాగే కుప్పం, ధర్మవరం ఏరియా ఆసుపత్రులు, జంగారెడ్డిగూడెం, అమలాపురం, చిలకలూరిపేట, శ్రీకాళహస్తి, అరకు, చింతపల్లి, రంపచోడవరం, చింతలపూడి, రామచంద్రాపురం, ఎస్ కోట, ఇతర ఏరియా ఆసుపత్రుల్లో తొలిసారిగా బెరా, ప్యూర్ టోన్ ఆడియోమెట్రీ పరికరాలను అందుబాటులోనికి తెచ్చారు.

### 6 జిల్లా ఆసుపత్రులు, కొన్ని ఏరియా ఆసుపత్రులకు ఇంపిడెన్స్ ఆడియో మెట్రీ పరికరాలు!

తెనాలి, అనకాపల్లి, చిత్తూరు, ప్రొద్దుటూరు, తణుకు, ఆత్మకూరు జిల్లా ఆసుపత్రులకు ఇంపిడెన్స్ ఆడియోమెట్రీ పరికరాలను అమర్చేశారు. ఇవికాకుండా. రాయచోటి, పుంగనూరు, నగరి, జమ్మలమడుగు, సాలూరు, గిద్దలూరు, కదిరి, ఇతర అసుపత్రులకు ఇంపిడెన్సీ ఆడియో మెట్రీ పరికరాలు వెళ్లాయి.

### 10 ఆసుపత్రుల్లో సౌండ్ ప్రూఫ్ రూములు!

తెనాలి జిల్లా ఆసుపత్రి, పాలకొండ, గజపతినగరం, నరసాపురం, పాలకొల్లు, కందుకూరు, బనగానపల్లి, దోన్, కావలి, నర్సీపట్న ఏరియా ఆసుపత్రుల్లో కొత్తగా సౌండ్ ప్రూఫ్ రూములను సిద్ధంచేశారు. వీటి ద్వారా సదరం వైద్య శిబిరాల ద్వారా వినికిడి లోపం కలిగిన వారిని గుర్తించడం మరింత సులువు అవుతుంది.

### పరికరాల వల్ల ఉపయోగాలిలా..

బెరా పరికరం ద్వారా వినికిడి లోపంతో పుట్టిన శిశువులకు సమస్య ఏస్థాయిలో ఉందో గుర్తించేందుకు వీలవుతుంది. సమస్య సూక్ష్మస్థాయిలో ఏస్థాయిలో ఉన్నప్పటికీ బెరా పరికరం ద్వారా గుర్తిస్తారు. చెవుల్లో అంతర్గతంగా కణితులు ఉన్నట్లయితే బెరా పరికరం ద్వారా తెలుసుకుంటారు. రెండు చెవులను ఒకేసారి పరీక్షించేందుకు కూడా వీలవుతుంది. నొప్పి లేకుండా సురక్షిత విధానంలో పరీక్ష ఉంటుంది.

ఆడియోమెట్రీ పరికరం ద్వారా నరాల బలహీనత కారణంగా చెవి సమస్య వచ్చిందా? చెవిలో ఇన్ఫెక్షన్ ఉందా? లేదా? అన్న దానితోపాటు ఇతర పరీక్షలు చేస్తారు.

ఇంపిడెన్స్ ఆడియోమెట్రీ పరికరం ద్వారా చెవుల మధ్య భాగంలో ఉండే ఫ్లూయిడ్స్, ఇన్ఫెక్షన్లు, కర్ణభేరి కదలికలు, ఒత్తిడి, పనితీరులో ఉన్న సమస్యలను ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తారు.

బెరా మిషన్ ఖరీదు రూ. 12,28,500, ఇంపిడెన్స్ ఆడియో మెట్రీ ఖరీదు రూ.8,76,750. ప్యూర్టోన్ ఆడియో మెట్రీ పరికరం ఖరీదు రూ.7,14,090 వరకు ఉంది. సౌండ్ ప్రూఫ్ గది ఏర్పాటుకు రూ.6,42,000 ఖర్చు పెడుతున్నారు.

## “బడికి పోదాం” కార్యక్రమంలో నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి



నరసన్నపేట (చైతన్యరథం): సారవకోట మండలం, అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ‘బడికి పోదాం’ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాలకు చేరుకున్న ఆయనకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులతో మమేకమై, వారి చదువు, లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువు కుంటే మంచి భవిష్యత్తు సాధించగలరని, విద్య ద్వారానే జీవితంలో ఉన్నత స్థానాలు పొందవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తూ పాఠశాలల అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపడుతున్నదని తెలిపారు. అలాగే ఉపాధ్యాయులతో సమావేశమై, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంపై దృష్టి పెట్టాలని, ప్రతి విద్యార్థి పాఠశాలకు హాజరు కావడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, యూనిట్ ఇన్‌ఛార్జ్ చల్ల ఆనంద్, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్ కమిటీ సమావేశం

### ● పాల్గొన్న పి.యు.సి సభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాదు



మైలవరం/వెలగపూడి (చైతన్యరథం): వెలగపూడిలోని శాసనసభ సచివాలయం కమిటీ హాల్-1లో పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్ కమిటీ సమావేశం కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో పి.యు.సి సభ్యులైన మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలపై ఈ సమావేశంలో చర్చించారు. ఏపీ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్, ఏపీ ఆరోగ్య వైద్య గృహనిర్మాణ మౌలిక సదుపాయాల సంస్థ, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ లిమిటెడ్, ఏపీ రాష్ట్ర సాగునీటి అభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ పట్టణ మౌలిక సదుపాయాల ఆస్తి నిర్వహణ సంస్థ లిమిటెడ్ సంస్థల గత ఐదేళ్ల వార్షిక నివేదికలు, సాధారణ కార్యకలాపాలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సహచర పి.యు.సి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్ క్వార్టర్స్ భూములు పరిశీలించిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

విశాఖపట్నం తూర్పు (చైతన్యరథం): పట్టణంలోని జీవీఎంసీ 15 మరియు 16 వార్డులు హెచ్‌బీ కాలనీ, స్టీల్ ప్లాంట్ క్వార్టర్స్‌లో ఉన్న ప్రభుత్వ భూములను విశాఖపట్నం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు స్టీల్ ప్లాంట్ క్వార్టర్స్ ఇన్‌ఛార్జ్ ఆంజనేయ రాజుతో కలిసి పరిశీలించారు. గవర్నమెంట్ భూములు వెంటనే స్వాధీనం చేసుకొని రక్షణ గోడలు నిర్మించాలని, జీవీఎంసీ అధికారులకు ఆదేశించారు. జీవీఎంసీ 15,16 వార్డుల్లో పార్కులన్న ప్రదేశాలను అన్ని పరిశీలించి రక్షణ గోడలు లేని దగ్గర తక్షణమే గోడల నిర్మాణం చేపట్టి పార్కులో అభివృద్ధి పనులు చేపట్టాలని జీవీఎంసీ జోనల్ కమీషనర్ శివప్రసాద్‌కి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ అధికారులు, జీవీఎంసీ జోనల్ కమీషనర్ శివప్రసాద్, జీవీఎంసీ శానిటేషన్ సిబ్బంది, బుగత సత్యనారాయణ, మళ్ల రవి మరియు గోందెల అప్పన్న పాల్గొన్నారు.

## ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటా : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు (చైతన్యరథం): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే అవకాశం ప్రజాదర్బార్ ద్వారా కలిగిందని, ఇది తనకు దక్కిన అదృష్టంగా భావిస్న?న్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. అయ్యా రేషన్ కార్డు ఇచ్చారు.. అందులో పేర్లు తప్పులుగా వచ్చాయి. సరి చేయించండి అంటూ ఒకరు.. పింఛన్ కోసం ఎన్నో రోజులుగా కాళ్లరిగేలా తిరుగుతున్నాం.. పింఛన్ ఇప్పించండయ్యా అంటూ మరొకరు.. జగన్ ప్రభుత్వంలో సెంటు స్థలం ఇచ్చామని పట్టా చేతిలో పెట్టారు.. కానీ స్థలం ఎక్కడ ఉందో చూపించ లేదు అంటూ ఇంకొకరు ఎమ్మెల్యే నసీర్‌కు అర్జీలు అందజేశారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించిన గంటా శ్రీనివాసరావు



భీమిలి (చైతన్యరథం): భీమిలి ఆర్డీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజలు ఆయనకు వినతి పత్రాలు అందజేశారు. 3వ వార్డు కృష్ణా కాలనీలో బోర్ వెల్ కావాలని, ఎస్సీ కాలనీలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. పోస్టాఫీసు సచివాలయంలోకి మార్చాలని.. గొల్లలపాలెం, కుమ్మరిపాలెంలలో రోడ్లు, డ్రెయిన్లు కావాలని విజ్ఞప్తి చేశారు. చిప్పాడలో తమకు చెందిన ఎకరం భూమిని 22 -ఎలో పెట్టారని.. ఆ స్థలంలో దివీస్ యాజమాన్యం హైస్కూల్ నిర్మించిందని బధిరులైన సరగడ అచ్చియమ్మ, రమణమ్మ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. సొంతిల్లు లేనందున తమకు సమీపంలోని ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలం కేటాయించాలని విన్నవించారు. భీమిలి ఫుట్ బాల్ స్టేడియంలో యూజర్ ఛార్జీలు వసూలు నిలిపివేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎం. విజయ్ కుమార్, ఎమ్మార్వో పి.రామారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## శరవేగంగా అచ్యుతాపురం ఫ్లై ఓవర్ పనులు

అనకాపల్లి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖపట్నానికి ఐటీ హబ్‌గా తీర్చిదిద్దుతోంది. నగరానికి గత రెండేళ్లలో ప్రముఖ ఐటీ కంపెనీలు ఎంట్రీ ఇచ్చాయి.. మరికొన్ని త్వరలోనే ఏర్పాటుకానున్నాయి. కొంతకాలంగా నగరానికి పర్యాటకుల రాక కూడా పెరగడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.. వీటిని పరిష్కరించేందుకు నగరంలో అవసరమైన చోట్ల ఫ్లై ఓవర్లు నిర్మిస్తున్నారు. అయితే అచ్యుతాపురం జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ఫ్లైఓవర్ నిర్మిస్తున్నారు. కొంతకాలంగా నిలిచిపోయిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. పిల్లర్లు, స్పాన్‌ల నిర్మాణం పూర్తికాగా.. ప్రీఫ్యాబ్రికేటెడ్ సిమెంట్ కాంక్రీట్ గడ్డర్ల ఏర్పాటు పనులు మొదలయ్యాయి. ఈ ఫ్లై ఓవర్ 615 మీటర్లు పొడవు, 24 మీటర్ల వెడల్పుతో 21 పైల్స్ (స్తంభాలు), 20 స్పాన్‌ల నిర్మాణం జరిగింది. ఈ స్పాన్‌లపై గడ్డర్‌లను ఏర్పాటు చేసే పనులు ప్రారంభం అయ్యాయి. ఈ గడ్డర్‌లను ఫ్లై ఓవర్‌కు సమీపంలోనే చోడపల్లి-కొండకర్ల జంక్షన్ మధ్య తయారు చేశారు. అక్కడి నుంచి ఫ్లై ఓవర్ దగ్గరకు భారీ వాహనాలపై తీసుకొచ్చి క్రేన్ సాయంతో స్పాన్లపైకి చేర్చారు. ఈ గడ్డర్లను ఏర్పాటు చేసిన తర్వాత రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం గడ్డర్ల నిర్మాణం జరుగుతుండటంతో అచ్యుతాపురం జంక్షన్ పూడిమడక వైపు వెళ్లే రోడ్డులో వాహనాలను అనుమతించడంలేదు.. మూసివేశారు. ప్రస్తుతం వాహనాలను మండల కాంప్లెక్స్, మార్టూరు రోడ్డు మీదుగా డైవర్ట్ చేశారు. ఈ ఫ్లై ఓవర్ పనుల్ని వేగవంతం చేసి వీలైనంత త్వరలోనే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. ఈ ఫ్లై ఓవర్ అందుబాటులోకి వస్తే వాహనాలు ట్రాఫిక్ జర్నీ చేయొచ్చు. ఈ అచ్యుతాపురం జంక్షన్ చాలా కీలకం.. ఇక్కడి నుంచి లెఫ్ట్‌కు వెళితే ఎలమంచిలి వెళతారు.. రైట్‌కు వెళితే పరవాడ, స్టీల్ ప్లాంట్ మీదుగా విశాఖపట్నం వెళ్లొచ్చు. అయితే అచ్యుతాపురం జంక్షన్‌లో వాహనాల రద్దీ కొంతకాలంగా పెరిగింది. ఈ ఫ్లై ఓవర్ లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలతో పాటుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.. అందుకే ఫ్లై ఓవర్ ప్లాన్ చేశారు. 2014-2019లో ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మించాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే పనులు ప్రారంభించే సమయానికి ప్రభుత్వం మారిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. టీడీపీ ప్రభుత్వ హయాంలో టెండర్లను రద్దు చేసి రీ టెండర్లను పిలిచారు.. 2022లో టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. అయితే రెండేళ్లలో ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు కండిషన్ కట్టారు.. అయితే టెండర్ దక్కించుకున్న సంస్థ పనులు చేపట్టలేదు. 2024 ఎన్నికలకు ముందు నారా లోకేష్ పాదయాత్రలో ఈ ఫ్లై ఓవర్‌ను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

## ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది




విశాఖపట్నం (చైతన్యరథం): వీఎంఆర్డీఏ చిల్డ్రన్ థియేటర్‌లో శుక్రవారం ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగుల పరపతి సహకార సంఘం వజ్రోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తూర్పు నియోజవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిద్దరిని సంఘం తరుపున ఘనంగా సత్కరించారు. అనంతరం వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ... ఆర్టీసీ ఉద్యోగుల పొదుపు, పరపతి సహకార సంఘం 75 సంవత్సరాల వేడుకలో పాల్గొనటం నా అదృష్టంగా భావిస్తున్నాను అని పేర్కొన్నారు. దేశంలోనే అత్యుత్తమ సంఘంగా పేరు తెచ్చుకున్న కోపరేటివ్ సొసైటీలో సభ్యులందరికీ అభినందనలు తెలిపారు. అత్యధిక సంఖ్యలో ఆర్టీసీ ఉద్యోగులు సభ్యులుగా ఉన్న సంఘం దేశంలో మరొకటి ఉండదని పేర్కొన్నారు. ఈ సంఘం ద్వారా ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించి, వారితో పాటు వారి కుటుంబసభ్యులకు చేదోడుగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సంఘాన్ని ఇన్ని సంవత్సరాలుగా విజయపథంలో నడిపిస్తున్న ఉద్యోగులకు కనపరిచిన తీరు అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందని, కొత్త బస్సులు ప్రవేశపెడుతున్నారన్నారు. మహిళలకి ఉచిత బస్ పథకం ద్వారా ప్రయాణికుల సంఖ్యను పెరిగారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈడి విజయరత్నం, డీపీటీ అప్పలనాయుడు, సీటీఎం సత్యనారాయణ, సంఘం కార్యదర్శి త్రాసు, యూనియన్ నాయకులు వై.శ్రీనివాసరావు, పాలక మండలి సభ్యులు శ్రీనివాసరాజు, ప్రసాద్, వినోద్, గోపాలప్ప, శివశంకర్, దొర, అనంత రాములు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఆర్టీసీ డిపోల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పార్టీ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి : చోడే వెంకట పట్టాభిరాం



విశాఖపట్నం (చైతన్యరథం): మనపై నమ్మకం ఉంచి తెలుగుదేశం పార్టీ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి పని చేసి పార్టీకి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని విశాఖ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరాం కోరారు. శుక్రవారం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఇటీవల క్రొత్తగా నియమితులైన టీడీపీ కమిటీ సభ్యులకు సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... పార్టీ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిత్యం కష్టపడి పనిచేయాలన్నారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరేటట్లు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లొడగల కృష్ణ మాట్లాడుతూ... టీడీపీలో కష్టపడి పనిచేసే వారికి ఎప్పుడూ పదవులు వస్తూనే ఉంటాయని, పార్టీకి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చే వారిని పార్టీ అధిష్టానం ఎప్పుడూ ప్రోత్సహిస్తూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఏపీలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ముఖ్య గమనిక. వచ్చే రెండు రోజులు రాష్ట్రవ్యాప్తంగా భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉంటాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. కొన్ని ప్రాంతాలలో ఎండలు, మరికొన్ని చోట్ల వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ అంచనా వేశారు. కొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత ఉంటుందని... మరికొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై పిడుగులతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. విభిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోవైపు ద్రోణి ప్రభావంతో శనివారం రోజున పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల అకస్మాత్తుగా పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మరోవైపు శనివారం రోజున



పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలంలో తీవ్రవడగాలులు వీచే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 27 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొంది. శుక్రవారం రోజున కడపలో అత్యధికంగా 45.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. నంద్యాల జిల్లా సంజామలలో 44.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపింది. వడగాలుల తీవ్రత నేపథ్యంలో ఎండలో బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. డీహైడ్రేషన్‌కు గురికాకుండా ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. మరోవైపు పిడుగులతో కూడిన వర్షాలు కురిసేందుకు అవకాశం నేపథ్యంలో.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,. వర్షం కురిసే సమయంలో బహిరంగ ప్రదేశాల్లో ఉండవద్దని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. చెట్ల కింద నిలబడవద్దని.. పురాతన భవనాలు, కల్వర్టులకు దూరంగా ఉండాలని సూచించింది.

# నేడు నిడదవోలులో సీఎం చంద్రబాబునాయుడు పర్యటన...

నిడదవోలు (చైతన్యరథం): నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటించనున్నారు. ఈ పర్యటనకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. సీఎం చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో అధికారులు జెడ్ ప్లస్ కేటగిరి భద్రతతో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి ముఖ్యమంత్రి పర్యటనను దిగ్విజయం చేయాలని బూరుగుపల్లి శేషారావు చంద్రబాబు పర్యటన వివరాలను మీడియాకు వెల్లడించారు. బూరుగుపల్లి శేషారావు మీడియా మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు ఉదయం 11:00 గంటలకు నిడదవోలు మారుతి లేఅవుట్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారని 11:20 గంటలకు సుబ్బారాజు పేట వద్ద ఏర్పాటు చేసిన 'ప్రజా వేదిక' సభలో పాల్గొని ప్రసంగిస్తారన్నారు. మధ్యాహ్నం 1:50 గంటలకు మాలకొండ చెరువును సందర్శించి, గుర్రపుడెక్క తొలగింపు పనులను పరిశీలించడంతో పాటు శాస్త్రవేత్తలు మరియు స్థానిక ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తారన్నారు. 2:30 గంటలకు పార్టీ కార్యకర్తలతో నిర్వహించే 'కేడర్ మీటింగ్'లో పాల్గొన్న అనంతరం, సాయంత్రం 4:15 గంటలకు చంద్రబాబు అమరావతికి తిరిగి బయలుదేరుతారని తెలిపారు.

# ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం : మంత్రి వాసంశెట్టి సుభాష్

రామచంద్రపురం (చైతన్యరథం): ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురం క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను నేరుగా మంత్రి సుభాష్‌కు తెలియజేశారు. ఇళ్ల స్థలాలు, వృద్ధాప్య పింఛన్లు, దివ్యాంగ పింఛన్లు, కొత్తరేషన్ కార్డులు కోరుతూ అర్జీలు అందాయి. వినతిపత్రాలను స్వీకరించిన మంత్రి, సమస్యలను అర్థం చేసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు గైకొనాలని ఆదేశించారు. ప్రజల సమస్యలపై ఎటువంటి ఆలస్యం సహించబోమని, వాటి పరిష్కారం దిశగా వేగంగా ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ... ప్రజలకు అందుబాటులో ఉండటం తన బాధ్యత అని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతానని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు




అర్హులందరికీ చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను దగ్గరగా తెలుసుకోవడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రజలకు నమ్మకాన్ని కలిగించే వేదికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ అధ్యక్షులు గుత్తుల సాయి, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్‌రాయ్, తెలుగుదేశంపట్టణ అధ్యక్షులు ఉండవల్లి శివ, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే టీడీపీ ధ్యేయం : బొడ్డు వెంకటరమణ

రాజానగరం (చైతన్యరథం): నియోజకవర్గం, బూరుగుపూడి గేట్ వద్ద తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సమస్యలు పరిష్కరించడం పార్టీకి మొదటి కర్తవ్యమని స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త ప్రజలతో నిత్యం మమేకమై వారి సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కారం చూపేలా కృషి చేయాలని సూచించారు. అదే సమయంలో పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. గ్రీవెన్స్ సమావేశంలో స్థానిక ప్రజలు, కార్యకర్తలు ఉంచిన సమస్యలను శ్రద్ధగా విన్న ఆయన, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా



చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ మరింత బలంగా ఎదగాలని, ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

**●పలువురి నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే వనమాడి కొండబాబు**



కాకినాడ (చైతన్యరథం): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించడానికే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు. శుక్రవారం కాకినాడ స్మార్ట్ సిటీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు నగరంలోని పలు డివిజన్ల నుంచి ప్రజలు భారీగా హాజరై తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను ఎమ్మెల్యే స్వయంగా విని, సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా నగరంలో దోమల సమస్య తీవ్రంగా ఉందని, రాత్రివేళల్లో వీధిలైట్లు పనిచేయడం లేదని, డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేదని, పార్కుల్లో లైటింగ్ సదుపాయాలు కల్పించాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ప్రజలు అర్జీల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కొత్త పెన్షన్ల కోసం ప్రజాదర్బార్‌కు అధిక సంఖ్యలో అర్జీలు వస్తున్నాయని తెలిపారు. అయితే కొత్త పెన్షన్లపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదని, ప్రభుత్వం ప్రకటించిన వెంటనే అర్హులందరికీ అందజేస్తామని స్పష్టం చేశారు. టిడ్కో ఇళ్ల విషయంలో ఎవరికైనా ఆసక్తి లేకపోతే వారు చెల్లించిన డబ్బులను తిరిగి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అలాగే ఇళ్ల స్థలాల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం సర్వే నిర్వహిస్తోందని, గ్రామాల మాదిరిగానే పట్టణ ప్రాంతాల్లో కూడా రెండు సెంట్ల స్థలాన్ని అందించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నదని తెలిపారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన ప్రతి సమస్యను అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. వెంటనే పరిష్కరించలేని సమస్యలపై ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ సిటీ నియోజకవర్గ ప్రత్యేకాధికారి, అదనపు కమిషనర్ కె.టి. సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి

**● యువత, రైతులకు ఎమ్మెల్యే చింతమనేని సూచన**



దెందులూరు (చైతన్యరథం): 'స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై రైతులకు, ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధికారులకు సూచించారు. దుగ్గిరాల్లోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రజల నుంచి వినతుల స్వీకరించి... అర్జీదారుల సమస్య పరిష్కారాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం, పీఎం కిసాన్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధిని ప్రోత్సహించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రైతులకు, నిరుద్యోగ యువతకు ఈ పథకాలపై పూర్తి అవగాహన కల్పించి, వారు ఆర్థికంగా ఎదిగేలా అధికారులు చొరవ చూపాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో రైతులకు యువతకు ఎంతో మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర రాష్ట్రాల్లోని ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని, వాటిని సద్వినియోగం జరిగేలాగా అధికారులు ప్రత్యేక చొరవ చూపి గ్రామస్తులకు అవగాహన కల్పించాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు.

# సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియలో ఎమ్మెల్యే సొంగ



చింతలపూడి (చైతన్యరథం): నియోజకవర్గంలో తొలి విడత జనగణన ప్రారంభించి అందరికీ ఆదర్శంగా నిలిచారు ఎమ్మెల్యే సొంగ రోషన్‌కుమార్... రాష్ట్రంలో గురువారం నుంచి స్వీయగణన కార్యక్రమం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే సొంగ రోషన్‌కుమార్ తన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకున్నారు. se.census.gov.in వెబ్‌సైట్ ద్వారా ఎమ్మెల్యే రోషన్‌కుమార్ వివరాలను నమోదు చేశారు. మొత్తం 33 ప్రశ్నలతో కూడిన ఈ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియ ఈ నెల 30వ తేది వరకు అందుబాటులో ఉంటుందని ప్రజలంతా స్వయంగా ఆన్‌లైన్‌లో తమ ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. స్వీయగణనకు సహకరించిన ఎమ్మెల్యేను నియోజకవర్గ రెవెన్యూ అధికారులు సత్కరించారు.

## బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్న చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): వినుకొండ పట్టణంలో ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోగా, ఆయన వారితో నేరుగా మాట్లాడి వినతి పత్రాలను స్వీకరించారు. మౌలిక సదుపాయాల సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల చెంతకు పాలనను చేర్చడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

**తలసేమియా చిన్నారుల కోసం రక్తదానం చేయండి**

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఈనెల 19వ తేదీ వినుకొండలోని జాషువా కళా ప్రాంగణంలో నిర్వహించనున్న స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను జీవీ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రక్తం లేక ఇబ్బందిపడుతున్న చిన్నారుల ప్రాణాలను కాపాడటం మనందరి బాధ్యతని, యువత మరియు స్వచ్ఛంద సేవకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



విజయవాడ తూర్పు (చైతన్యరథం): ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా దర్బారులో తెలియజేసిన సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరిస్తున్నామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు చెప్పారు. పటమట అశోక్‌నగర్‌లోని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు హాజరై ప్రజల నుంచి తమ సమస్యలపై వినతిపత్రాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు మాట్లాడుతూ... ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు ప్రతి శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజాదర్బార్‌లో తెలియజేసిన ప్రతి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజాదర్బార్‌లో తెలియజేసిన ప్రతి సమస్యను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కరించే విధంగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామని చెప్పారు. ప్రజాదర్బార్‌లో ప్రజలు తెలియజేసిన సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూడా చూస్తారని, అందువల్ల ప్రజాదర్బార్‌లో తెలియజేసిన ప్రతి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా అధికారులు చూస్తారని, అందువల్ల ప్రజలు ఈ ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కోరారు. ఈ కార్యక్రమములో ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, శిరీషా గాంధీ, పెనుగొండ శ్రీను, పీరుబాబు, కర్నా కోటేశ్వరరావు, ముని కృష్ణ, పలు డివిజన్ల టీడీపీ అధ్యక్షులు, హౌసింగ్, వివిఎంసి అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేష్ నియామకం పట్ల ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



అమరావతి (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను గన్నవరం ఎమ్మెల్యే మరియు ఏపీ ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లిలోని లోకేష్ నివాసానికి వెళ్లిన ఆయన, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ... లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపిందని కొనియాడారు. రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీని మరింత శక్తివంతమైన రాజకీయ పక్షంగా తీర్చిదిద్దడంలో లోకేష్ కీలక పాత్ర పోషిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు టీడీపీ ద్వారా 1289 మంది ఎమ్మెల్యేలు, 149 మంది లోక్‌సభ సభ్యులు దేశానికి ప్రాతినిధ్యం వహించారని, 9 మంది కేంద్ర మంత్రులు, వందల సంఖ్యలో రాష్ట్ర మంత్రులు, రాజ్యసభ మరియు శాసనమండలి సభ్యులను అలానే అనేక మంది ప్రజా నాయకులను దేశానికి అందించిన విశిష్ట గౌరవం తెలుగుదేశం పార్టీదే అని అన్నారు. దేశ ప్రధానుల, రాష్ట్రపతి ఎంపికలోనూ, అలాగే లోక్‌సభ స్పీకర్, గవర్నర్ పదవుల భర్తీలోనూ టీడీపీ కీలక పాత్ర పోషించిన చరిత్ర ఉందని పేర్కొన్నారు. నందమూరి తారక రామారావు మహత్తర దూరదృష్టితో 44 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ ఉద్యమాన్ని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన క్రమశిక్షణ, విజన్‌తో అత్యున్నత స్థాయికి తీసుకెళ్లారని యార్లగడ్డ తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర బడ్జెట్‌ను 10 రెట్లు పెంచిన ఘనత చంద్రబాబు నాయుడుదేనని ఆయన గుర్తు చేశారు. అంకితభావంతో శ్రమించే కార్యకర్తలే టీడీపీకి అసలైన బలమని, అలాంటి గొప్ప వారసత్వం మరియు విలువలున్న పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేష్ బాధ్యతలు స్వీకరించడం ఒక గౌరవప్రదమైన మైలురాయి అని ఆయన అభివర్ణించారు. లోకేష్ నాయకత్వంలో తెలుగుదేశంపార్టీ మరిన్ని కొత్త శిఖరాలను అధిరోహించాలని యార్లగడ్డ వెంకట్రావు ఆకాంక్షించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయం : బూర్ల రామాంజనేయులు




ప్రత్తిపాడు (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయం అని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు వ్యాఖ్యానించారు. శుక్రవారం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ప్రజా గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి నిర్ణీత వ్యవధిలో పరిష్కారం చూపాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ... ప్రజా సమస్యల సత్వర పరిష్కారం చూపడం కూటమి ప్రభుత్వం యొక్క ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులను పారదర్శకంగా స్వీకరించి, సంబంధిత శాఖలకు పంపించి తక్షణ చర్యలు తీసుకునే విధంగా చేపట్టడం జరుగుతుందని, ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతగా పరిగణించి నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## నిబద్ధత గల నాయకునికి పదవి రావడం ఆనందదాయకం



ఉయ్యూరు (చైతన్యరథం): పార్టీ పట్ల నిబద్ధత గల నాయకునికి పదవి రావడం ఆనందదాయకమని, తెలుగు మహిళలు, కార్మిక పరిషత్ నాయకులు, దళిత సంఘం నాయకులు వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా నూతనంగా నియమించబడ్డ సందర్భంగా రాజేంద్రప్రసాద్‌ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలతో శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 25 సంవత్సరాలుగా ప్రజాప్రతినిధిగా, 45 సంవత్సరాలుగా ప్రజా సేవలో ఉంటూ, ఉయ్యూరు ప్రజల ముద్దుబిడ్డగా, వారి సొంత ఇంట్లో మనిషిగా ఉంటూ ఏప్పుడు ఎవరికీ ఏ కష్టం వచ్చినా గాని నేనున్నానంటూ భరోసా కల్పించే నాయకుడు రాజేంద్రప్రసాద్‌అని, ఆయనకు ఈ పదవి రావడం మా అందరికీ ఆనందదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు పరిమి సలోమి సంతోషి, కోరాడ వెంకటలక్ష్మి, తెనాలి పద్మావతి, తెలుగు మహిళలు మాదినేని జ్యోతి, అరుణ, ఆశా దేవి, కార్మిక పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి యార్లగడ్డ రమేష్, ఉయ్యూరు డిపో కార్యదర్శి శోభనాద్రి, ట్రెజరీ రవికుమార్, జిల్లా నాయకులు శ్రీనివాసరావు, రమేష్, రవి, మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు కిరణ్, టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ప్రదీప్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌ను సత్కరించిన ముస్లిం మైనార్టీ నాయకులు




జగ్గయ్యపేట (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులుగా నియమితులైన సందర్భంగా శుక్రవారం జగ్గయ్యపేట పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ ఉమ్మర్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్‌ని పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజాసేవా తపనను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ఆరోగ్యం, ఆయురారోగ్యాలతో పాటు ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ప్రార్థిస్తూ ప్రత్యేక దువాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షేక్ అక్బర్, తెలుగుదేశం పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు షేక్ మదార్, మాబు మియా, దర్గా ప్రెసిడెంట్ షేక్ రఫీ, బిలాలు, అబూ బాకర్, రహీం, ఇలియాజ్, పట్టణ ముస్లిం మైనార్టీ ఉపాధ్యక్షులు షేక్ నాగుల్ మీరా, పట్టణ ముస్లిం మైనార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ బాలిబాబు, అహ్మద్, బాజీ తదితరులు పాల్గొన్నారు.

## యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్న లోకేష్ నియామకం



పెదకూరపాడు (చైతన్యరథం): నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన మంత్రి నారా లోకేష్‌ని మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లోకేష్ నాయకత్వం పార్టీకి కొత్త దిశానిర్దేశం చేస్తుందని, యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ, లోకేష్ సమర్థ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత శక్తివంతం చేసేందుకు, ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. లోకేష్ నాయకత్వంలో టీడీపీ మరింతగా బలోపేతం అవుతుందన్నారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# కష్టపడే వారిని ఆదరించే పార్టీ టీడీపీ

## టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమితుడైన డాక్టర్ నూకసాని బాలాజీకి అభినందన వెల్లువ



ఒంగోలు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా నియమితులైన డాక్టర్ నూకసాని బాలాజీకి ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుండి వచ్చిన పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ రోజు ఒంగోలు భాగ్యనగర్ లోని టూరిజం క్యాంప్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న డాక్టర్ నూకసాని బాలాజీని కలసి శుభాకాంక్షలు తెలియజేయాలని వచ్చి ఎర్రగొండపాలెం, దర్శి, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, ఒంగోలు, చీరాల, సంతనూతలపాడు, కందుకూరు, కావలి నియోజవర్గాల్లోని పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున వచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. కష్టపడి పనిచేసే స్వభావం ఉన్న బాలాజీ, గతంలో జిల్లా పార్టీ అధ్యక్షులుగా పని చేసే సమయంలో పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని తీరుస్తూ ముందు సాగారు.. ఆరోజు పడిన కష్టానికి ఈ రోజు ప్రతిఫలంగా తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా అవకాశం లభించిందని పార్టీ నాయకులు హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూకసాని బాలాజీ మాట్లాడుతూ పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, చంద్రబాబు నాయుడుకి, లోకేష్ బాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. వెనుకబడిన బడుగు బలహీన వర్గాలైన బీసీలకు ఎల్లప్పుడూ తెలుగుదేశం పార్టీ ప్రాధాన్యత ఇస్తూ పార్టీలో సముచిత స్థానాన్ని కల్పిస్తుందని అనడానికి నిదర్శనమే నూకసాని బాలాజీకి జాతీయ ఉపాధ్యక్షులుగా పదవి ఇవ్వడం అని బీసీ వర్గాలు నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన పార్టీ నాయకులు కార్యకర్తలు, శ్రేయోభిలాషులు అందరూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు, కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి, కందుకూరు మాజీ శాసనసభ్యులు దివి శివరాం, ఒంగోలు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు, ఒంగోలు నగర మాజీ మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు పార్లమెంట్ కమిటీ కార్యవర్గ సభ్యులు, షేక్ ఆరీఫా, గార్లపాటి శ్రీనివాసరావు, కసుకుర్తి అంకరాజు, తంజావూరి శ్రీనివాస మూర్తి, గడ్డం బాలయ్య, రాష్ట్ర కార్యదర్శి అడకస్వాములు, మాజీ ఏఎంసీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు ఒంగోలు పార్లమెంట్ మాజీ కార్యదర్శి కేసన శేషమ్మ, మాజీ కార్య నిర్వహక కార్యదర్శి తమ్మినేని వెంకటరెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ డైరెక్టర్ నక్క శీను, కాటం రాజు టెంపుల్ చైర్మన్ గుమ్మా గంగరాజు, పొదిలి పోలేరమ్మ టెంపుల్ చైర్మన్ ముని శ్రీనివాసులు, జిల్లా సాంస్కృతి కమిటీ సభ్యురాలు చల్లా నాగేశ్వరమ్మ, కార్యక్రమ నిర్వాహకులు జాజుల శ్రీను, మహాత్మ జ్యోతిరావు పూలే నాటక కమిటీ సభ్యులు పాటిబండ్ల ఆనందరావు కేవెల్ నరసింహారావు, బంకా చిరంజీవి, సాగం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం కోసం కేటాయించిన స్థలాన్ని ఒంగోలు భాగ్యనగర్ కి వెళ్ళిన ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంట్ కమిటీ కార్యవర్గ సభ్యులు, షేక్ ఆరీఫా, గార్లపాటి శ్రీనివాసరావు, కసుకుర్తి అంకరాజు, బీరం అరుణ రెడ్డి,తంజావూరి శ్రీనివాస మూర్తి తదితరులు ఉన్నారు.

# మహిళా బిల్లు వీగిపోవడం బాధాకరం

## దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆవేదన

దర్శి (చైతన్యరథం): కాంగ్రెస్ కూటమికి మహిళల పట్ల ఎంత వ్యతిరేకత ఉందో ఈ బిల్లును అడ్డుకోవడం చూస్తే అర్థమవుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల సాధికారికత పట్ల చట్టసభల్లో మూడో వంతు మహిళలకు రిజర్వేషన్ ఇచ్చే బిల్లును ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పార్లమెంట్లో ప్రవేశ పెట్టడం ఒక చారిత్రాత్మకమైన ఘట్టమన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లును అన్ని పార్టీలు ఎంపీలు మద్దతు ఇవ్వాలని పలుసార్లు విన్నవించారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు స్వయంగా అన్ని రాజకీయ పార్టీలకు ఎంపీలకు లేఖలు రాసి బిల్లులు ఆమోదించేందుకు కృషి చేశారన్నారు. ఆనాడు టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ మహిళల సాధికారతకు చేసిన కృషి ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలన్నారు. అయితే కాంగ్రెస్ కూటమి పక్షాలు మహిళలను కేవలం ఓటు బ్యాంకులుగా మార్చుకొని మహిళా రిజర్వేషన్ బిల్లును నేడు చట్టసభల్లో వ్యతిరేకించడం మహిళలకు ఒక బ్లాక్ డేగా నిలిచిపోతుందన్నారు. మహిళలందరూ ముక్తకంఠంతో కాంగ్రెస్ కూటమి పక్షాల తీరును ప్రశ్నించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదేవిధంగా డీ లిమిటేషన్ బిల్లులో దక్షిణాది రాష్ట్రాలకు 50 శాతం సీట్లు పెరుగుతాయని, ఎలాంటి అన్యాయం జరగదని ప్రధానమంత్రి చెప్పినప్పటికీ ఈ బిల్లుకు కూడా కాంగ్రెస్ పక్షాలు మోకాలడ్డేశాయన్నారు. 2011 జనాభా ప్రకారం దక్షిణాదికి ఎలాంటి నష్టం జరగదని ప్రకటించినప్పటికీ కాంగ్రెస్ కూటమి పక్షాలు ఈ బిల్లులను వ్యతిరేకిస్తూ ఈ బిల్లులను అడ్డుకోవడం చరిత్రలో కాంగ్రెస్ రూపంలో ఒక బ్లాక్ డేగా నిలిచిపోతుందన్నారు.



# సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

## అధికారులకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పిలుపు



వింజమూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ప్రజలకు మరింత సమీపంగా పాలన అందించాలనే లక్ష్యంతో ప్రజాదర్బార్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా వినిపించి, వాటికి తక్షణ పరిష్కారం చూపించే దిశగా ఒక సమగ్ర వేదికగా నిలిచింది. ఈ ప్రజాదర్బార్ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి, తహసిల్దారులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, నీటిపారుదల శాఖ ప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, డీఆర్డీఏ సిబ్బంది, ఇతర సంబంధిత విభాగాల అధికారులు పాల్గొని ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించారు. వివిధ శాఖల సమన్వయంతో సమస్యల పరిష్కారం వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వింజమూరు, కలిగిరి, కొండాపురం మరియు జలదంకి మండలాలకు చెందిన నాయకులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకి సమర్పించారు. ప్రతి అర్జీని శ్రద్ధగా పరిశీలించిన కాకర్ల సురేష్, సంబంధిత శాఖల అధికారులకు తక్షణమే స్పందించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రజా సమస్యల పరిష్కారమే మా ప్రధాన ధ్యేయం" అని పేర్కొంటూ, ప్రతి అధికారి బాధ్యతతో, పారదర్శకంగా పనిచేసి ప్రజలకు న్యాయం చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తేనే ప్రజల సమస్యలకు సమగ్ర పరిష్కారం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రజలకు మరింత దగ్గరగా ఉంటూ, వారి అవసరాలు, సమస్యలు తెలుసుకుని వెంటనే చర్యలు తీసుకోవాలనే సంకల్పాన్ని మరోసారి ప్రతిబింబించింది. ప్రజల నుంచి కూడా ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.

# సమస్యల పరిష్కార వేదికగా ప్రజాదర్బార్ నిర్వహణ

## టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి




నెల్లూరు రూరల్ (చైతన్యరథం): ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. ప్రతి రోజు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నెల్లూరు రూరల్ ప్రజలకు ఉదయం 7గంటల నుండి రాత్రి 8 గంటల వరకు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని ఈ సందర్భంగా గిరిధర్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో నిర్విరామంగా ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను పరిష్కారం దిశగా చేపట్టవలసిన చర్యలు అధికారులతో కలసి ఎప్పటికపుడు సమన్వయం చేస్తున్నామన్నారు. పరిష్కారం అయ్యే ప్రతీ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ మేయర్ నందిమండలం భాను శ్రీ క్లస్టర్ ఇంచార్జులు జలదంకి సుధాకర్, సాబీర్ ఖాన్, నూకరాజు మదన్ కుమార్ రెడ్డి, కో క్లస్టర్ ఇంచార్జులు రాఘవేంద్ర, కోటి రెడ్డి, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ మెంబర్ అబిధా సుల్తానా, 25వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు శేషు యాదవ్, 20వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు చేజర్ల మహేష్ బాబు, 28వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు చెక్క సాయి సునీల్, టీడీపీ నాయకులు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత .. కూటమి ప్రభుత్వ బాధ్యత!

**ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు**

రాయదుర్గం, (చైతన్యరథం): రాష్ట్రంలో మహిళలు, బాలికల భద్రతపై చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. రాయదుర్గం పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మహిళలు, బాలికల భద్రత పై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం మహిళల రక్షణకు, భద్రతకు పెద్దపీట వేస్తోందన్నారు. వారిపై ఎలాంటి అఘాయిత్యాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలకు ప్రత్యేక ప్రణాళిక రూపకల్పన చేసిందన్నారు. తమ వద్ద ఉన్న ఫోన్లో శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకుని ఏ సమయంలోనైనా పోలీసులను సంప్రదించవచ్చన్నారు. ఆకతాయిల బెదిరింపులు, దౌర్జన్యాలకు భయపడకుండా ఎలాంటి సమస్య అయినా పోలీసులతో చర్చించవచ్చున్నారు. వారిని జాగ్రత్త పరిచేందుకే ప్రభుత్వం అవగాహన కార్యక్రమాల ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోందన్నారు. అన్యాయాలను, దౌర్జన్యాలను ఎదిరించి గట్టిగా నిలబడి పోరాడే అనితమ్మను హోం శాఖ మంత్రిగా సీఎం. నియమించారన్నారు. ఆమె రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో పర్యటిస్తూ మహిళలను బాలికలను చైతన్య పరుస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరు అప్రమత్తతతో ఉండాలని, ఏదైనా అనుకోని సంఘటన ఎదురైతే ధైర్యంగా పోరాడాలన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు మహిళల్లో సామాజిక మార్పు, ఆత్మ విశ్వాసాన్ని తప్పక పెంచుతాయన్నారు. మహిళల రక్షణకు తీసుకునే చర్యలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు కూడా తోడ్పాటు అందించాలనీ కోరారు. సమాజం మొత్తం కలిసి పనిచేసినప్పుడే పూర్తి స్థాయి భద్రత సాధ్యమవుతుందన్నారు. ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాలు మహిళలు, బాలికల సంక్షేమానికి మరింత దోహదపడతాయని ఎమ్మెల్యే కాలవ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బండి భారతి,కురుబ ప్రశాంతి, సంపత్ కుమారి, బీజేపీ నాయకురాలు వసుంధర దేవి పాల్గొన్నారు.





# ప్రజా సమస్యలను పరిష్కరించండి

**అభివృద్ధిపై సమీక్షలో అధికారులకు మంత్రి సవిత ఆదేశం**

పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖల మంత్రి సవితమ్మ మున్సిపాలిటీ పరిధిలోని కూటమి నాయకులు, వార్డు ఇంచార్జిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పెనుకొండ మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులను వార్డు వారీగా సమగ్రంగా చర్చించారు. ప్రతి వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. త్వరలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నాయకులు తమ తమ వార్డుల్లో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మంత్రి పేర్కొన్నారు. వార్డు పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వివరాలు వెల్లడిస్తూ, పట్టణంలో ఏప్రిల్ 20వ తేదీన అన్న క్యాంటీన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని వార్డు ఇంచార్జిలు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# చెట్ల ఖర్చుపై వైసీపీ దుష్ప్రచారం

నెల్లూరు (చైతన్యరథం): చెట్ల నాటే విషయంలో “ఒక్క చెట్టు ఖర్చు ఎక్కువ” అంటూ వైసీపీ నాయకులు చేస్తున్న ప్రచారం పూర్తిగా హాస్యాస్పదమని టీడీపీ ఇంచార్జ్ డాక్టర్ గణేష్ కుమార్ అన్నారు. గుప్తాపార్క్ సెంటర్‌లోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి నారాయణ ఆదేశాల మేరకు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు నాయకత్వంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. వైసీపీ నాయకులకు సవాల్ విసురుతూ, “మీ పాలనలో నాటిన చెట్ల సర్వైవల్ రేట్ ఎంత? ఆ వివరాలను ప్రజలకు వెల్లడించాలి” అని డిమాండ్ చేశారు. చెట్లు నాటడం కంటే వాటిని బ్రతికించడం ముఖ్యమని పేర్కొన్నారు. వైసీపీ అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడం, ప్రతి పనిలో తప్పులు వెతకడం వారి రాజకీయ విధానమని విమర్శించారు. టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ మార్గదర్శకత్వంలో “ప్రతి ఇంటికి ఒక చెట్టు” లక్ష్యంతో కార్యక్రమాన్ని ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో, గౌరవ అధ్యక్షులు, సిద్దకళాచారి, ప్రధాన కార్యదర్శి కల్లుకుంట భాస్కర్ , బూత్ ఇంచార్జులు వీరమల్లు చంద్రశేఖర్, కంచి కృష్ణ, నెల్లూరు నగర టీయన్టీయుసి ఉపాధ్యక్షులు బొందిలి సురేంద్ర సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

**గుంతకల్లు శాసనసభ్యుడు గుమ్మనూరు జయరాం**



గుంతకల్లు (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాలు మేరకు గుత్తి పట్టణం ఎంపీడీవో ఆఫీసులో ప్రజా దర్బార్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుంతకల్లు శాసనసభ్యుడు గుమ్మనూరు జయరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన వద్దకు వచ్చిన సమస్యలను వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కారం చేయడం కూడా జరుగుతుందన్నారు. పరిష్కారం కాని సమస్యలను కేంద్ర కార్యాలయం తెలుగుదేశం పార్టీ దృష్టికి తీసుకువెళ్లి కూడా పరిష్కారం చేస్తామన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కచ్చితంగా కూటమి ప్రభుత్వం జెండాను ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుత్తి ఎమ్మార్వో, ఎంపీడీవో, సంబంధిత అధికారులు, గుత్తి పట్టణం, మండల కూటమి నాయకులు కార్యకర్తలు అనుబంధ కమిటీ సభ్యులు హాజరయ్యారు.

# ఆడుదాం ఆంధ్రలో అవినీతి ఫుల్.. అవగాహన నిల్!

**మాజీ మంత్రి రోజాపై శాప్ ఛైర్మన్ రవినాయుడు విమర్శలు**

అనంతపురం (చైతన్యరథం): ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో అవినీతి చూస్తే ఫుల్ గా ఉందని.. అవగాహన మాత్రం నిల్ గా కనిపించిందని.. శాప్ ఛైర్మన్ రవినాయుడు విమర్శలు చేశారు. రాయదుర్గం పర్యటనలో భాగంగా ఆయన అనంతపురం అర్బన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి వచ్చారు. స్థానిక అర్బన్ టీడీపీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. రవినాయుడు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎన్నికైన నేపథ్యంలో ఆయన్ని ఘనంగా సత్కరించారు. అనంతరం అర్బన్ టీడీపీ నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు “ఆడుదాం ఆంధ్ర” పేరుతో క్రీడా శాఖను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి తన వ్యక్తిగత ప్రచారం కోసం క్రీడా పరికరాలపై తన ముఖచిత్రాన్ని ముద్రించి టీ-షర్టు, బ్యాట్లు, కిట్లు వంటి సామగ్రిపై వినియోగించారని ఆరోపించారు. అప్పటి క్రీడా శాఖ మంత్రికి సరైన అవగాహన లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన అభిప్రాయపడ్డారు. “ఆడుదాం ఆంధ్ర” పేరుతో భారీ కుంభకోణం జరిగిందని, దానికి ‘జగన్ మోహన్ రెడ్డి కుంభకోణం’ అని పేరు పెట్టవచ్చన్నారు. ఈ వ్యవహారంలో సుమారు 40 కోట్ల రూపాయల అవినీతి జరిగిందని.. దీనికి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అదేవిధంగా, క్రీడా శాఖ మంత్రిగా పని చేసిన రోజా తనకు రాజకీయ భిక్ష పెట్టిన చంద్రబాబు నాయుడుని విమర్శించడం సరికాదన్నారు. ఆమెకు రాజకీయంగా అవకాశాలు కల్పించిన వ్యక్తిని తూలనాడుతూ తన మనస్తత్వాన్ని ప్రదర్శించుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వం క్రీడా పాలసీ లేకుండానే శాఖను నడిపిందని విమర్శించిన రవి నాయుడు అదే నిధులను సక్రమంగా వినియోగించి ఉంటే ప్రతి జిల్లాకు క్రీడా సామగ్రి అంది ఉండేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత క్రీడా రంగానికి ప్రాధాన్యత ఇస్తూ... పెండింగ్‌లో ఉన్న క్రీడా మైదానాలు, స్టేడియంలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా, 3శాతం



హారిజాంటల్ రిజర్వేషన్ విధానంలో మెగా డీఎస్సీ ద్వారా 421 పోస్టులను భర్తీ చేసినట్లు వెల్లడించారు. అనంతపురం జిల్లాలోని ఉరవకొండ, తాడిపత్రి, రాయదుర్గం, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో క్రీడా వికాస్ కేంద్రాలను పూర్తిచేసి త్వరలోనే క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. క్రీడల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రవి నాయుడు పేర్కొన్నారు.

## చంద్రబాబు జన్మదినం సందర్భంగా...

# కువైట్‌లో మహా రక్తదాన శిబిరం







**కువైట్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని... ఆయన 50 ఏళ్ల రాజకీయ ప్రస్థానానికి గుర్తుగా కువైట్‌లో మహా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్ఆర్ఐ టీడీపీ కువైట్ విభాగం ఆధ్వర్యంలో గల్ఫ్ కౌన్సిల్ సభ్యుడు వెంకట్ కోడూరి అధ్యక్షతన అదాన్ ఆసుపత్రిలో ఈ శిబిరం జరిగింది. దాదాపు 200 మంది రక్తదానం చేయగా 500 మందికిపైగా అభిమానులు, కార్యకర్తలు హాజరై తమ నాయకుడిపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. రక్తదాతలను అభినందిస్తూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పంపిన ప్రశంసాపత్రాలను ఈ సందర్భంగా అందజేశారు.

కార్యక్రమాన్ని ఉద్దేశించి వెంకట్ కోడూరి మాట్లాడుతూ... "ఐదు దశాబ్దాలుగా చంద్రబాబునాయుడు అంకితభావంతో ప్రజా సేవ చేస్తూ భారత రాజకీయాల్లో అరుదైన స్థానం సంపాదించుకున్నారు. అభివృద్ధి అంటే ఏమిటో, పరిపాలనలో పారదర్శకత ఎలా ఉండాలో, ప్రజల కోసం పాలన ఎలా సాగాలో తన దూరదృష్టితో చూపించిన మహానేత ఆయన... రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి అపారం. సమాచార, సాంకేతికత, మౌలిక వసతులు, పెట్టుబడులు, యువతకు అవకాశాలు రంగాల్లో బాబు నాయకత్వం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది. అలాంటి మహా నేత జన్మదినం వేళ వేడుకలే కాకుండా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు జరుపుకోవడం మేమంతా గౌరవంగా భావిస్తున్నాం" అని తెలిపారు.

"రక్తదానం మహాదానం. మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం ఒకరి ప్రాణాన్ని కాపాడగలదు. అందుకే మా ప్రియ నాయకుడు చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని సేవా దినోత్సవంగా మార్చి ఈ మహా రక్తదాన శిబిరం నిర్వహించాం. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా తెలుగు ప్రజలు సమాజ సేవలో ముందుండాలని ఈ కార్యక్రమం ద్వారా ఒక బలమైన సందేశాన్ని ఇస్తున్నాం" అన్నారు.

బాలయ్య బాబు అభిమానులు, జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు, నారా రోహిత్ అభిమానులు సహకరించిన తీరు ప్రశంసనీయమని కొనియాడారు. వివిధ సంస్థల ప్రతినిధులు, సభ్యులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేసి మానవతా విలువలను చాటారు.



కువైట్‌లో ఉన్న తెలుగు ప్రజల ఐక్యత, సేవా స్ఫూర్తి, తమ నాయకుడిపై ఉన్న అపారమైన అభిమానం ఈ కార్యక్రమం ద్వారా ప్రతిబింబించిందని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి సమాజ సేవలో ముందుండాలని వెంకట్ కోడూరి పిలుపునిచ్చారు.

డాక్టర్స్ ఫోరం ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షురాలు డాక్టర్ సుసోవనా ప్రముఖ, మాజీ అధ్యక్షుడు డాక్టర్ దివాకర్, కమ్యూనిటీ కార్యదర్శి డాక్టర్ రఘునందన్, బ్లడ్ డోనర్స్ కేరళ నిమిష్‌కుమార్, జయన్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్ఆర్ఐ టీడీపీ కువైట్ సీనియర్ నాయకుడు ములకల సుబ్బారాయుడు, ధరూరి బలరాంనాయుడు, ఉదయ్‌ప్రకాశ్, ఓలేటి దివాకర్, మాలేపాటి బాబు, పొలరుపు బాబూనాయుడు, డాక్టర్ నెట్టెం కృష్ణ, కమిటీ సభ్యులు మోహన్ రాచూరి, శ్రీకాంత్ చింతల, రవి మలిశెట్టి, దొడ్డిపల్లి సుబ్బరాజు, దౌర్ల సాయి, భాస్కర్, రవి, వెంకట సుబ్బయ్య, శశికుమార్, సాయి నిర్వహణలో విశేష కృషి చేశారు. అస్మా గవర్నరేట్ అధ్యక్షుడు ముస్తాక్‌ఖాన్, హవేలీ గవర్నరేట్ అధ్యక్షుడు రెడ్డయ్య చౌదరి, ఫర్వానీయ గవర్నరేట్ అధ్యక్షుడు రమేష్‌చౌదరి, జహ్రా గవర్నరేట్ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణచైతన్య, ఏపీఎన్ఆర్టీఎస్ సభ్యులు, గుడ్‌విల్ అంబాసిడర్స్, తెలుగు యువత అధ్యక్షుడు దుగ్గినేని మురళి, మాజీ అధ్యక్షులు కృష్ణంరాజు, సాయి వెంకటసుబ్బారావు, బీసీ విభాగం అధ్యక్షుడు శంకర్ యాదవ్, మహిళ అధ్యక్షురాలు నారాయణమ్మ, నేస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు నాగేష్, జనం-మనం ఉపాధ్యక్షుడు జిలానీ భాష వారివారి కమిటీల సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

మైనార్టీ కమిటీ సభ్యులు, జనసేన కువైట్ అధ్యక్షుడు హరి రాయల్ ప్రసాద్, మల్లికార్జున రాయల్, చిరు సేవా సమితి అధ్యక్షుడు బాల రెడ్డయ్య చౌదరి, బంజారా సేవా సమితి అధ్యక్షుడు, గల్ఫ్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కోడి నారాయణ, సుగవాసి ప్రసాద్‌బాబు, యువసేన అధ్యక్షుడు రెడ్డి శేఖర్, పరిటాల ట్రస్టు అధ్యక్షుడు నరసింహులు, పసుపులేటి బ్రహ్మయ్య సేవా సమితి అధ్యక్షులు, వారి కమిటీ సభ్యులు, ఏపీ యూత్ అధ్యక్షుడు ఖాన్, బడుగు, బలహీనవర్గాల నేత రామకృష్ణ, వారి కుటుంబ సభ్యులను వెంకట్ కోడూరి ప్రత్యేకంగా అభినందించారు. వారి అహర్నిశల కృషి, సమన్వయం, సేవాభావం వల్లే ఈ కార్యక్రమం ఇంత ఘనంగా జరిగిందన్నారు.









# కీలక మలుపు దిశగా భారత రాజకీయాలు

*భారతదేశ రాజకీయాల్లో ప్రస్తుతం ఒక మార్పు దశ నడుస్తోంది. సంప్రదాయ రాజకీయాల నుంచి న్యూ జనరేషన్ పాలిటిక్స్ వైపు మార్పు అనివార్యం అవుతోంది. ఈ సందర్భంలో యువ నేత నారా లోకేష్ టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎన్నిక కావడం కేవలం ఒక పదవి మార్పు కాదు-ఇది ఒక కీలక దిశ, ఒక భవిష్యత్ దృక్పథం. ఎప్పటికపుడు రాజకీయాలు కొత్త రూపు సంతరించుకుంటున్న నేపథ్యంలో యువతను రాజకీయాల్లోకి తీసుకురావడం అనేది అనివార్యం. కాలంతో పరుగులు తీస్తున్న నేటి టెక్నాలజీ యుగంలో యువత ఆలోచన శైలి కూడా మారుతోంది. ఇన్‌స్టంట్ ఫలితాలను కోరుకుంటున్నారు. ఏఐ వంటి భవిష్యత్ తరం టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన తరుణంలో యువత పారదర్శకతను ఆశిస్తోంది. ఈ మైండ్‌సెట్‌ను అర్థం చేసుకుని రాజకీయాలను కొత్త దిశలో తీసుకెళ్లగల నాయకత్వం అవసరం. ఆ లక్షణాలు నారా లోకేష్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆయన్ను ఒక "యూత్ ఐకాన్"గా యువత చూస్తోందంటే... కేవలం హామీలపై కాకుండా అవకాశాలు, ఫలితాలు కావాలన్నది వారి అంతరంగం.*

*ఇక మహిళా సాధికారత విషయానికి వస్తే, తాజాగా పార్లమెంటులో ప్రవేశపెట్టిన నారీశక్తి వందన్ పేరిట మహిళా రిజర్వేషన్ బిల్లు దురదృష్ట వశాత్తు వీగిపోయినా మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు టీడీపీ చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు సీబీఎన్, నారా లోకేష్ చొరవ చూపడం ముదావహం. విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు మహిళా బిల్లును ఆమోదించాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తూ అన్ని పార్టీలకు స్వయంగా లేఖలు రాయడం అభినందనీయం.*

## చంద్రబాబు, లోకేష్ సారధ్యంలో తెలుగుదేశం ముందడుగు



*యువ నాయకత్వం, మహిళా సాధికారత విషయంలో ఒకే దిశగా కలసి పయనిస్తే ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక కొత్త శకం ప్రారంభమవుతుంది. యువ నేత నారా లోకేష్ నాయకత్వంలో టీడీపీ ఈ మార్పునకు సిద్ధమవుతోంది. ఆయన దృష్టి కేవలం ఎన్నికల విజయంపై కాదు. ఒక సస్టైనబుల్ పొలిటికల్ ఎకోసిస్టమ్‌ను నిర్మించడంపై ఉంది. అక్కడ యువతకు అవకాశాలు ఉంటాయి. మహిళలకు గౌరవం, ప్రతిభకు ప్రాధాన్యం ఉంటుంది. ఇది కేవలం రాజకీయ వ్యూహం కాదు ఒక సామాజిక బాధ్యత. యువత, మహిళాలోకాన్ని శక్తివంతం చేస్తేనే దేశం బలపడుతుంది. మహిళలను ముందుకు తీసుకెళ్తే సమాజం అన్ని విధాలా ముందుఉంటుంది. ఈ రెండింటినీ కలిపి ఒక కొత్త రాజకీయ సంస్కృతిని నిర్మించడమే న్యూ జనరేషన్ పాలిటిక్స్. జాతీయ స్థాయిలో టీడీపీకి ఇది ఒక సువర్ణావకాశం. సమర్ధవంతమైన నాయకత్వం, సమగ్రాభివృద్ధి విధానాలతో యువత, మహిళలకు అవకాశాలు కల్పిస్తే పార్టీకి దీర్ఘకాల భవిష్యత్తు ఉంటుంది. ఆ దిశగా చంద్రబాబు నాయుడు, లోకేష్ ఇప్పటికే కసరత్తు ప్రారంభించడం ఒక కీలక మలుపు.*

**సుమ తాతినేని**
ఎన్ఆర్ఐ టీడీపీ
మెల్బోర్న్, ఆస్ట్రేలియా



# రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా మూడోసారి హరివంశ్ నారాయణ్ ఎన్నిక



రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ ఎన్నికయ్యారు. వరుసగా మూడుసార్లు ఆయన ఉప సభాపతి పదవిని చేపట్టడం విశేషం. ఏప్రిల్ 10న హరివంశ్ డిప్యూటీ చైర్మన్‌గా రాజీనామా చేశారు. అనంతరం రాజ్యసభకు నామినేట్ అయిన ఆయన మళ్లీ ఆ పదవికి ఎన్నికయ్యారు. హరివంశ్ ఉపసభాపతిగా ఎన్నుకోవడానికి కేంద్ర మంత్రి జేపీ నడ్డా రాజ్యసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ, ప్రతిపక్ష పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే డిప్యూటీ చైర్మన్‌కు శభాకాంక్షలు తెలిపారు. నామినేటెడ్ సభ్యుడు డిప్యూటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికవడం ఇదే మొదటిసారి. ఉప సభాపతి ఎన్నిక అనంతరం మోదీ మాట్లాడుతూ.. "వరుసగా మూడోసారి హరివంశ్ డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నికవడం హర్షనీయం. ఆయనపై సభకు ఉన్న ప్రగాఢమైన నమ్మకానికి ఇది నిదర్శనం. అనుభవం, సభలో అందరినీ ఒకతాటిపై నడిపించడానికి ఆయన చేసిన ప్రయత్నాల వల్ల సభకు ఎంతో ప్రయోజనం కలుగుతోందని" మోదీ అన్నారు. "డిప్యూటీ చైర్మన్ సభలో ప్రతిపక్షానికి తగిన ప్రాధాన్యం, సమయం ఇస్తారని నమ్ముతున్నా" అని మల్లిఖార్జున ఖర్గే పేర్కొన్నారు. ఇదిలావుండగా, హరివంశ్ ఎన్నికకు ముందే సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్‌లు సభ నుంచి వాకౌట్ చేశాయి.

## సాధికారత కోసమే మహిళా బిల్లు



లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై కొనసాగిన సుదీర్ఘ చర్చ ముగిసింది. వీటిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చారు. మహిళా సాధికారత కోసమే ఈ బిల్లులను తీసుకొచ్చామని, వచ్చే ఎన్నికల్లో వీటిని అమలు చేసేలా ముందుకెళ్తున్నామన్నారు. అయితే, ఇండి కూటమి సభ్యులు దీన్ని వ్యతిరేకించారని అన్నారు. "మూడు బిల్లులపై సమగ్రంగా చర్చ జరిగింది. 130 మంది ఎంపీలు తమ అభిప్రాయాలు చెప్పారు. 50 మంది మహిళా ఎంపీలు మాట్లాడారు. మహిళా బిల్లును విపక్షాలు వ్యతిరేకించాయి. ప్రస్తుత లోక్సభ నియోజకవర్గాల జనాభాలో భారీ వ్యత్యాసం ఉంది. ఒకచోట 30 లక్షల మంది ఓటర్లు ఉంటే మరోచోట 60 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఒక ఎంపీ లక్షలాది మంది సమస్యలను ఎలా అలకించగలరు? నియోజకవర్గాల ఓటర్ల సంఖ్యలో సమతుల్యతను సాధించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఎంపీ తన నిధులు సమర్థంగా వినియోగించుకునేందుకు ఇది తోడ్పడుతుంది. అందుకే ఈ రాజ్యాంగ సవరణకు ఉపక్రమించాం" అని అమిత్ షా పేర్కొన్నారు. 1972లో ఇందిరా గాంధీ ప్రభుత్వం లోకసభ సీట్లను 545కు పెంచారు. ఇన్నాళ్లపాటు సీట్లు సంఖ్య పెంచకుండా అడ్డుకున్న ఘనత వారిదే అని కాంగ్రెస్‌పై అమిత్ షా విరుచుకుపడ్డారు.

# టీసీఎస్ నాసిక్ నేరగాళ్ల వెనుక భారీ ముఠా



## మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ వెల్లడి

టీసీఎస్ నాసిక్ క్యాంపస్‌లో లైంగిక వేధింపులు, మత మార్పిడిలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. ఈ ఘటన అత్యంత తీవ్రమైనదని, దీని వెనుక పెద్ద ముఠా ప్రమేయం ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. టీసీఎస్ యాజమాన్యం సైతం ఈ దారుణాన్ని ఖండించిందన్నారు. ఈ ఘటనలకు బాధ్యుల్ని వదిలిపెట్టబోమని.. దీనిపై విచారణకు కేంద్ర దర్యాప్తు సంస్థలను రంగంలోకి దించుతామని తెలిపారు. పోలీసులు ఇప్పటి వరకు ఎనిమిది మందిని అరెస్ట్ చేసి, విచారిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కేసుపై నాసిక్ పోలీస్ కమిషనర్ సందీప్ కార్నిక్ మాట్లాడుతూ బాధితురాలు తన సమస్యపై పలుమార్లు హెచ్‌ఆర్ విభాగానికి ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోలేదన్నారు. అంతే కాకుండా పని ప్రదేశాల్లో ఇలాంటివి జరుగుతుంటాయని నిర్లక్ష్యంగా మాట్లాడి పోలీసులకు ఫిర్యాదు చేయకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. నిందితులకు అతివాద భావజాల గ్రూపులతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టీసీఎస్ నాసిక్ క్యాంపస్‌లో పని చేస్తున్న ఓ మహిళా ఉద్యోగి తన సహోద్యోగిపై ఫిర్యాదు చేశారు. పెళ్లి పేరుతో తనను మోసగించినట్లు అందులో పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు చేసే క్రమంలో మరో ఏడుగురు మహిళలు ముందుకొచ్చి తమపై జరిగిన వేధింపుల గురించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2022 ఫిబ్రవరి నుంచి 2026 మధ్య పని ప్రదేశంలో తమపై లైంగిక వేధింపులకు జరిగినట్లు సదరు మహిళా ఉద్యోగులు వాపోయారు.




# కెనడా అధికారుల అదుపులో కో పైలట్

## గంజాయితో పట్టుబడిన నేరంపై దర్యాప్తు

ఎయిరిండియా కోపైలట్ ఒకరు శాన్‌ఫ్రాన్సిస్కోలో విమానాశ్రయంలో గంజాయితో పట్టుబడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అతడు 'స్టాఫ్ ఆన్ డ్యూటీ' కింద ప్యాసింజర్ క్యాబిన్‌లో దిల్లీ నుంచి శాన్ఫ్రాన్సిస్కో వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో అతడు విమానాన్ని నడపాల్సి ఉంది. ఈ క్రమంలో శాన్‌ఫ్రాన్సిస్కోలో అధికారులు చేసిన తనిఖీల్లో కోపైలట్ బ్యాగ్లో గంజాయి బయటపడింది. దీంతో వారు ఎయిరిండియాకు సమాచారం అందించారు. అనంతరం అమెరికా యూఎస్ అధికారులు కోపైలట్ను వేరే విమానంలో భారత్‌కు పంపించారు. ఏప్రిల్ 14న జరిగిన ఈ ఘటనపై డీజీసీఏకు ఎయిరిండియా ఫిర్యాదు చేసింది. ఈ విషయాన్ని ఎయిరిండియా సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. చట్ట ఉల్లంఘనలను తాము ఏమాత్రం ఉపేక్షించబోమని పేర్కొంది. కంపెనీ నిబంధనల ప్రకారం సదరు కోపైలట్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని తెలిపింది. గతంలోనూ ఎయిరిండియాకు చెందిన ఓ పైలట్ ఇదే విధంగా నిబంధనలు ఉల్లంఘించి అధికారులకు పట్టుబడ్డారు. డిసెంబర్ 2025 లో వాంకోవర్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దిల్లీ వెళ్లాల్సిన విమానానికి చెందిన ఎయిర్ ఇండియా కెప్టెన్ రెండు బ్రీత్ అనలైజర్ పరీక్షల్లో విఫలమయ్యారు. దీంతో కెనడా అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.

# కాంగ్రెస్ నేత పవన్ ఖేరాకు సుప్రీంలో చుక్కెదురు

## అస్సాం సీఎం సతీమణిపై అసత్య ఆరోపణల కేసు

కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరాకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. అస్సాంలోని గువాహటిలో నమోదైన కేసులో ఏప్రిల్ 20 వరకు చర్యలు తీసుకోకుండా రక్షణ కల్పించాలని కోరుతూ చేసిన అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ముందస్తు బెయిల్ కోసం అస్సాంలోని న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచించింది. ఇటీవల ఖేరా మీడియాతో మాట్లాడుతూ.. అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ భార్య రిణికి భూయాన్ శర్మకు పలు పాస్పోర్టులు ఉన్నాయని, విదేశీ ఆస్తులు ఉన్నాయని ఆరోపించారు. వాటిని హిమంత తన ఎన్నికల అఫిడవిట్లో ప్రస్తావించలేదన్నారు. అయితే ఆరోపణలను సీఎం, ఆయన భార్య తోసిపుచ్చారు. అదంతా అసత్య ప్రచారమని ఖండించిన సంగతి తెలిసిందే. రిణికి భూయాన్ శర్మ ఇచ్చిన ఫిర్యాదు. మేరకు ఖేరాపై గువాహటిలో కేసు నమోదైంది. ఈ కేసు నమోదైన రాష్ట్రంలో సంబంధిత కోర్టును ఆశ్రయించడానికి అవకాశం కల్పిస్తూ వారం రోజులపాటు తాత్కాలిక ముందస్తు బెయిలును మంజూరు చేస్తూ తెలంగాణ హైకోర్టు కొన్ని రోజులు ఉపశమనం కల్పించింది. అయితే దానిపై సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల స్టే విధించింది. తాజాగా జరిగిన విచారణలో బెయిల్ కోసం అస్సాంలోని న్యాయస్థానానికి వెళ్లమని సూచించింది. అలాగే ఖేరా పిటిషన్‌ను త్వరితగతిన విచారించాలని అస్సాంలోని కోర్టులను ఆదేశించింది.





# రూ.215 కోట్ల మనీలాండరింగ్ కేసు కీలక మలుపు

## అప్రూవర్‌గా మారతానన్న బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్

ఆర్థిక నేరగాడు సుకేశ్ చంద్రశేఖర్‌కు సంబంధించిన రూ.215 కోట్ల మనీలాండరింగ్ కేసు కీలక మలుపు తిరిగింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటోన్న బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ అప్రూవర్గా మారేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు అనుమతివ్వాలంటూఢిల్లీ కోర్టును అభ్యర్థించారు. అయితే, ఇందుకోసం ముందుగా ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను సంప్రదించాలని నటికి న్యాయస్థానం సూచించింది. నిబంధనల ప్రకారం.. ఇలాంటి కేసుల్లో అప్రూవర్‌గా మారాలంటే ముందుగా దర్యాప్తు సంస్థను అభ్యర్థించాల్సి ఉంటుంది. ఆమె వాంగ్మూలాన్ని రికార్డ్ చేసిన అనంతరం సాక్షిగా మారేందుకు కోర్టులో దరఖాస్తు చేయాలా, వద్దా అనేదాన్ని దర్యాప్తు సంస్థ నిర్ణయిస్తుంది. ఈ మనీలాండరింగ్ వ్యవహారానికి సంబంధించి తనపై ఈడీ కేసు కొట్టేయాలంటూ జాక్వెలిన్ వేసిన పిటిషన్‌ను గతేడాది సుప్రీంకోర్టు కొట్టేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా ఆమె అప్రూవర్‌గా మారేందుకు సిద్ధమవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆర్థిక నేరగాడు సుకేశ్ చంద్రశేఖర్ ప్రధాన నిందితుడిగా ఉన్న రూ.215 కోట్ల దోపిడీ కేసులో జాక్వెలిన్ను ఈడీ నిందితురాలిగా పరిగణించిన సంగతి తెలిసిందే. దోపిడీ చేసిన డబ్బు నుంచి నటి లబ్ధి పొందినట్లు దర్యాప్తులో గుర్తించామని ఈడీ వర్గాలు గతంలో వెల్లడించాయి. సుకేశ్ దోపిడీదారు. అని జాక్వెలిన్‌కు ముందే తెలుసని, అయినప్పటికీ అతడితో సాన్నిహిత్యాన్ని కొనసాగించారని సదరు వర్గాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలో వీరిద్దరూ కలిసి ఉన్న ఫొటోలు అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో వైరల్గా మారాయి. ఇక, సుకేశ్ నుంచి జాక్వెలిన్ ఖరీదైన బహుమతులు అందుకున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. అత్యంత ఖరీదైన డిజైనర్ బ్యాగులు, జిమ్ సూట్లు, వజ్రాల చెవిపోగులు, బ్రాస్లెట్, మినీ కూపర్.. ఇలా దాదాపు రూ.10 కోట్ల విలువైన కానుకలను జాక్వెలిన్, ఆమె కుటుంబసభ్యులకు సుకేశ్ ఇచ్చినట్లు ఈడీ దర్యాప్తులో గుర్తించింది. కాగా, ఈ ఆరోపణలను పలుమార్లు ఖండించిన నటి, తనపై నమోదైన ఈడీ కేసును కొట్టేయాలంటూ తొలుత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీనికి ఉన్నత న్యాయస్థానం తిరస్కరించడంతో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని పరిశీలించిన అత్యున్నత న్యాయస్థానం, ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఇదిలాఉండగా జాక్వెలిన్ తన ప్రేయసి అని సుకేశ్ పేర్కొంటున్న సంగతి తెలిసిందే. ఆమె పుట్టిన రోజు, ప్రత్యేక సందర్భాల్లో జైలు నుంచే అతడు నటికి ప్రేమ సందేశాలు పంపించడం గమనార్హం.

# దుబాయిలో ఎయిర్ టాక్సీ స్టేషన్



ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకు పెరుగుతున్న రద్దీ దృష్ట్యా ఎయిర్ టాక్సీలు అందుబాటులోకి తీసుకురావడానికి అనేక దేశాలు కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నాయి. త్వరలో తమ పౌరులకు ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్టు దుబాయ్ ప్రకటించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ప్రపంచంలోనే తొలి ఎయిర్‌టాక్సీ స్టేషన్లు నిర్మించింది. ఈ విషయాన్ని దుబాయ్ యువరాజు హమ్దాన్ బిన్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ ప్రకటించారు. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయ సమీపంలో నిర్మించిన స్టేషన్ ఈ ఏడాది చివరికి ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది.

**ప్రత్యేకతలివే..**

ఎయిర్‌టాక్సీ స్టేషన్‌ను 3,100 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. ఏటా 1,70,000 మంది ప్రయాణించడానికి వీలుగా సౌకర్యాలు కల్పిస్తున్నారు. కార్లలో సుమారు 45 నిమిషాలు పట్టే సమయంతో పోలిస్తే ఎయిర్ ట్యాక్సీల్లో కేవలం 10 నిమిషాల్లోనే గమ్యస్థానానికి చేరుకోవచ్చు. రెండు ల్యాండింగ్ ప్యాడ్లు, ఎలక్ట్రిక్ విమానాల కోసం ఛార్జింగ్ పాయింట్లు, రెండుస్థాయిల కార్ పార్కింగ్‌వంటి సౌకర్యాలు అందుబాటులోకి తెస్తున్నారు. అర్బన్ ఎయిర్ ట్యాక్సీ సేవలతోపాటు కార్గో, లాజిస్టిక్స్, మెడికల్, ఎమర్జెన్సీ సేవల కల్పనకు అవకాశం అంది. నాలుగు స్టేషన్ల నెట్వర్క్‌లో భాగంగా ఈ ఎయిర్ స్టేషన్‌ను నిర్మించినట్టు అధికారులు వెల్లడించారు. 2026 చివరికి డౌన్టౌన్ దుబాయ్, పామ్ జుమేరా, దుబాయ్ మెరీనాలలోనూ ఎయిర్ స్టేషన్ల నిర్మాణం పూర్తిచేసి, అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. నూతన, సుస్థిరమైన రవాణా విధానాలను అవలంబించడంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నామన్నారు. ఈ ప్రాజెక్టును స్కైపోర్ట్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, దుబాయ్ రోడ్స్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. నగరాల మధ్య ప్రయాణ సమయాలను గణనీయంగా తగ్గించడానికి ఎయిర్ టాక్సీ సేవలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

**ఎయిర్ ట్యాక్సీలంటే..**

ప్రస్తుతం సరకు రవాణాకు ఉపయోగపడుతున్న డ్రోన్లకంటే కాస్త పెద్ద పరిమాణంలో ఉండే క్వాడ్ కాప్టర్‌వంటి వాటిని ఎయిర్ టాక్సీలు అంటారు. ఇవి ఆకాశమార్గంలో ఇద్దరినుంచి ఆరుగురిని స్వల్ప దూరాలకు తీసుకెళ్లగలవు. తక్కువ సమయంలో గమ్యాన్ని చేరుకోవటానికి ఈ సేవలు ఉపయోగపడతాయి.

# పోటాపోటీ ఆయుధ పరీక్షలు

**నోటమ్‌లు జారీ చేసిన భారత్-పాక్**

క్షిపణుల ప్రయోగాలు చేపట్టనున్న నేపథ్యంలో భారత్–పాకిస్థాన్‌లు ఒకేసారి నోటమ్‌లు జారీ చేశాయి. ఈ క్రమంలో అరేబియా సముద్రంలో పోటాపోటీగా ఇరుదేశాలు క్షిపణుల విన్యాసాలు జరపనున్నట్టు తెలుస్తోంది. ఏప్రిల్ 20 తెల్లవారుజామున 3:00 గంటల నుంచి ఏప్రిల్ 21 మధ్యాహ్నం 3:00 గంటల వరకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని పాకిస్థాన్ నోటమ్ జారీ చేసింది. అలాగే భారత్ కూడా ఏప్రిల్ 22న ఉదయం 9:30 నుంచి ఏప్రిల్ 25న రాత్రి 9:30 గంటల వరకు సుదీర్ఘ కాలానికి ఈ హెచ్చరికలు జారీ చేసింది. సముద్రంపై సైనిక విన్యాసాల సమయంలో నిర్దేశించిన జోన్లకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని 'నోటీసెస్ టు ఎయిర్మెన్','మారిటైమ్ అడ్వైజరీస్' లాంటి హెచ్చరికలు జారీ చేయడం దేశాల మధ్య సాధారణంగా జరుగుతూనే ఉంటుంది. అయితే ఇరుదేశాలు ఒకేసారి ఈ నోటములు ప్రకటించడం విశేషం. పాక్ 200 కిలోమీటర్ల మేర ఈ జోన్‌ను



ప్రకటించగా, దానికి రెట్టింపు గా భారత్ 400 కిలోమీటర్ల క్షిపణుల విన్యాసం కోసం జోన్‌ను ప్రకటించింది. అయితే సరిహద్దు దేశాలు తరచూ ఇలాంటి క్షిపణుల ప్రయోగాలు నిర్వహిస్తూనే ఉంటాయి. ఆపరేషన్ సిందూర్ జరిగిన ఏడాది తర్వాత ఈ ఆయుధ పరీక్షలపై ప్రకటనలు వెలువడడం గమనార్హం.

# యుద్ధంలోకి పాలపిట్టలు!

**షాహెద్ వర్సెస్ మెరోప్స్..**



ఇరాన్‌తో యుద్ధం తొలినాళ్లలో భారీగా సైనిక నష్టాన్ని చవిచూసిన అమెరికా.. కాస్త ఆలస్యంగానైనా దాన్నుంచి తేరుకుంది. ఇరాన్ షాహెద్ డ్రోన్లకు విరుగుడుగా 'మెరోప్స్' ఇంటర్‌సెప్టర్ డ్రోన్లను రంగంలోకి దించింది. ఈ విషయాన్ని తాజాగా అమెరికా సైనిక కార్యదర్శి డేనియల్ డిస్కాల్ తమ దేశ కాంగ్రెస్ ఎదుట వెల్లడించారు. ఇతర ఇంటర్‌సెప్టర్ వ్యవస్థలతో పోలిస్తే చాలా చౌకగా లభించే ఈ 'తేనెపిట్టలు'.. అగ్రరాజ్యంపై యుద్ధ భారాన్ని భారీగానే తగ్గించాయట..! ఇరాన్‌తో యుద్ధం మొదలైన దాదాపు వారంరోజుల్లో తాము 13వేల 'మెరోప్స్'ను తయారీ కంపెనీల నుంచి కొనుగోలు చేసినట్టు కాంగ్రెస్ విచారణలో డేనియల్ వెల్లడించారు. "ఇవి చాలా అద్భుతంగా పని చేస్తున్నాయి. ప్రస్తుతం వీటి ధర 15వేల డాలర్ల వరకు ఉంది. ఎక్కువ మొత్తంలో కొంటే ఇంకా తక్కువ ధరకే లభిస్తాయి. దాంతో షాహెద్ డ్రోన్లను కూల్చేందుకు మాకు 30వేల డాలర్ల నుంచి 50వేల డాలర్లలోపే ఖర్చవుతుంది. దీనివల్ల వ్యయాన్ని చాలావరకు తగ్గించుకుంటున్నాం" అని అమెరికా సైనిక కార్యదర్శి తెలిపారు. తొలుత వీటిని ఉక్రెయిన్‌లో వినియోగించగా.. మంచి ఫలితాలు వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. దాదాపు నెల క్రితమే 10,000 'మెరోప్స్' డ్రోన్లను పశ్చిమాసియాకు తరలించినట్టు తెలిపారు.

వాస్తవానికి ఇరాన్ షాహెద్ డ్రోన్లను అడ్డుకునేందుకు తొలుత అమెరికా 'పేట్రియాట్' వంటి ఖరీదైన క్షిపణులను వినియోగించాల్సి వచ్చింది. వీటి ధర రూ.కోట్లల్లో ఉండటంతో ఖర్చు తడిసిమోపెడవుతోంది. ఇక, 'కోయోట్' లాంటి డ్రోన్ ఇంటర్‌సెప్టర్లు అమెరికా వద్ద ఉన్నా.. 'మెరోప్స్'తో పోలిస్తే వాటి ధర దాదా పు 10 రెట్లు ఎక్కువగా ఉంది. దీంతో ఖర్చు భారాన్ని దృష్టిలో ఉంచుకొని అగ్రరాజ్యం 'మెరోప్స్'ను కొనుగోలు చేసింది. అయితే, వీటిలో ఎన్నింటిని పశ్చిమాసియాలో ఉపయో గించారు? ఇవి ఎన్ని షాహెద్ డ్రోన్లను కూల్చే శాయన్న వివరాలను మాత్రం డేనియల్ వెల్లడించలేదు.

**ఏంటీ 'మెరోప్స్'..?**

'మెరోప్స్' అనేది ఏఐ ఆధారిత యాంటీ డ్రోన్ వ్యవస్థ. యూఎస్ 'ప్రాజెక్ట్ ఈగల్'లో భాగంగా వీటిని అభివృద్ధి చేశారు. ఇవి చిన్న సైజులో ఉండటంతో పికప్ ట్రక్కు వెనకాల సులువుగా వీటిని అమర్చుకోవచ్చు. షాహెద్‌లాంటి వన్వే అటాక్ డ్రోన్లను ఇవి సమర్థవంతంగా అడ్డుకోగలవు. వీటిల్లోని ప్రొపెల్లర్ ఆధారిత సర్వేయర్లు మూడు అడుగుల పొడవు ఉంటాయి. ఇవి గంటకు 175 మైళ్ల వేగంతో ప్రయాణించగలవు. ఈ సర్వేయర్లు పేలుడు పదార్థాలను మోసుకెళ్లి.. ప్రత్యర్థి డ్రోన్లను నేరుగా ఢీకొట్టి పేల్చేస్తాయి. లేదా ఆ డ్రోన్లపై బాంబులను ప్రయోగించి వాటిని కూల్చేస్తాయి.

శాటిలైట్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ వ్యవస్థలు అందుబాటులో లేని సమయంలో కృత్రిమ మేధ సాయంతో మెరోప్స్ ప్రయాణించి లక్ష్యాన్ని ఛేదిస్తాయి. ఇవి ఆటోమేటెడ్ విధానంలోనూ పనిచేయగలవు. లేదా ఆన్‌బోర్డ్ సెన్సర్లను ఉపయోగించి రిమోట్‌గా వీటిని ప్రయోగించే వీలుంటుంది. వాస్తవానికి 'మెరోప్స్' అంటే తేనెటీగలను తినే చిన్న రంగురంగుల పిట్ట. దీన్ని 'తేనెపిట్ట' అని పిలుస్తారు. దీని పేరు మీదుగానే ఈ యాంటీ డ్రోన్ ఆయుధ వ్యవస్థకు 'మెరోప్స్' అని పేరు పెట్టినట్టు సమాచారం.

## ఇరాన్‌తో డీల్ కుదిరితే..
# ఇస్లామాబాద్ వెళ్తా: ట్రంప్



ఒకవేళ ఇరాన్‌తో ఫైనల్ డీల్ కుదిరితే, ఇస్లామాబాద్‌లో జరిగే చర్చల్లో పాల్గొనేందుకు తాను కూడా వెళ్లనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డోనాల్ట్ ట్రంప్ తెలిపారు. ఇరాన్‌తో దాదాపు అన్ని అంశాల్లో డీల్ కుదిరినట్టు తెలుస్తోంది. శుద్ధీకరించిన యురేనియంను కూడా అప్పగించేందుకు ఇరాన్ అంగీకరించినట్టు ఆయన చెప్పారు. నెవడా, ఆరిజోనా రాష్ట్రాల పర్యటనకు వెళ్లే ముందు ఆయన వైట్‌హౌజ్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. పాక్ నేతృత్వంలో సాగుతున్న దౌత్యపరమైన చర్చలు కొలిక్కి వస్తాయని ఆశిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుత సీజ్‌ఫైర్ ముగియకముందే ఇరాన్‌తో ఒప్పందం కుదిరే అవకాశాలున్నట్టు ఆయన వెల్లడించారు. ఒకవేళ ఆ డీల్‌పై ఇస్లామాబాద్‌లో సంతకాలు చేయాల్సి వస్తే, తాను అక్కడకు వెళ్లే అవకాశం ఉంటుందని ట్రంప్ తెలిపారు. ఒకవేళ డీల్ కుదిరితే సీజ్‌ఫైర్ పొడిగింపు ఉండబోదన్నారు. వాషింగ్టన్, టెహ్రాన్‌మధ్య చర్చల్లో యురేనియం అంశమే కీలకంగా మారిన విషయం తెలిసిందే. గత ఏడాది జూన్‌లో అమెరికా–ఇజ్రాయిల్ దళాలు ఇరాన్ అణు కేంద్రాలపై దాడి చేశాయి. అయితే అండర్‌గ్రౌండ్‌లో దాచిన యురేనియంను అప్పగించేందుకు ఇరాన్ ఒప్పుకున్నట్టు ట్రంప్ తెలిపారు. అణ్వాయుధాన్ని తయారు చేసేందుకు ఇరాన్ నిరాకరించిందన్నారు. న్యూక్లియర్ డస్ట్‌ను ఇరాన్ అప్పగించనున్నట్టు చెప్పారు. ఇరాన్, అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం మరో అయిదు రోజుల్లో ముగియనున్నది.

# విమానాలకు విశ్రాంతేనా?

**- యూరప్‌లో అడుగంటుతున్న జెట్ ఫ్యూయల్**



పశ్చిమాసియా యుద్ధం సెగ ఇప్పుడు వైమానిక రంగాన్నీ తాకింది. యూరప్‌లో ఆరు వారాలకు సరిపడా జెట్ ఇంధనం మాత్రమే మిగిలి ఉందని, ఇరాన్–యూఎస్ యుద్ధ సంక్షోభం ఇలాగే కొనసాగితే విమానాల రద్దు త్వరలోనే ప్రారంభమవుతుందని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ హెడ్ ఫాతిహ్ బిరోల్ హెచ్చరించారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా హర్మూజ్ జలసంధి వద్ద రవాణా నిలిచిపోయిందని, దీంతో ఆయిల్, గ్యాస్, ఇతర ముఖ్యమైన సరఫరాలకు తీవ్ర ఆటంకం ఏర్పడిందని, ఇది గతంలో ఎన్నడూ ఎదుర్కోని అతి పెద్ద ఇంధన సంక్షోభమని ఆయన వ్యాఖ్యానించారు. ఇదే పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగితే ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణంపై చెడు ప్రభావం చూపుతుందని అన్నారు. గ్యాస్, పెట్రోల్, విద్యుత్తు చార్జీలు అధికం కావడం ద్వారా అది ప్రజలపై పెను భారాన్ని మోపుతుందని అన్నారు. ప్రస్తుత ఎనర్జీ సంక్షోభం కారణంగా భారత్, పాకిస్థాన్, చైనా, బంగ్లాదేశ్, జపాన్ దేశాలు అత్యధికంగా ప్రభావితం అయినట్టు గుర్తించామని తెలిపారు. ఈ సంక్షోభం కారణంగా, ఎక్కువగా నష్టపోయేది ఎవరి గొంతుక వినిపిస్తుందో వారు కాదని, ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశాలేనని ఆయన పేర్కొన్నారు. హొర్ముజ్ జలసంధి వద్ద వాణిజ్య నౌకలకు ఇరాన్ టోల్ విధానాన్ని ప్రవేశపెట్టడాన్ని ఆయన తప్పుబడుతూ ఇదే విధానాన్ని ఆసియాలోని మలక్కా జలసంధితో పాటు పలు ప్రాంతాల్లో అమలు చేస్తారని విమర్శించారు.

# అమెరికా వీసా పరిమితుల విధానం కొనసాగింపు

వీసాలపై వరుసగా ఆంక్షలు, నియంత్రణలు విధిస్తున్న అమెరికా ప్రభుత్వం.. ఇప్పుడు వీసా పరిమితుల విధానాన్ని కొనసాగించాలనే నిర్ణయం తీసుకుంది. తాజాగా కెనడా, మెక్సికో, బ్రెజిల్, అర్జెంటీనా, కొలంబియావంటి దేశాల్లో తమ వీసా నియంత్రణ విధానాన్ని విస్తరిస్తున్నట్టు తెలిపింది. ఇందులోభాగంగా ఇప్పటికే 26మంది విదేశీయులపై ఆంక్షలు విధించినట్టు అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించింది. దేశ ప్రయోజనాలను దెబ్బతీయడానికి శత్రు దేశాల కోసం పనిచేస్తున్న వారిని లక్ష్యంగా చేసుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపింది. దేశంలోని వ్యూహాత్మక, కీలక వనరులు, ఆస్తులు శత్రువులపరం కాకుండా జాగ్రత్తపడడమే తమ లక్ష్యమని విదేశాంగశాఖ పేర్కొంది. అమెరికా ప్రజల శ్రేయస్సు, జాతీయ భద్రత, ప్రయోజనాల కోసం ట్రంప్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపింది. దేశ ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీయడం, ప్రాంతీయ భద్రతను అస్థిరపరచడం వంటి కార్యకలాపాలు నిర్వహించే విదేశీయులు, వారి కుటుంబసభ్యులకు అమెరికాలోకి ప్రవేశంపై నిషేధం విధిస్తామని హెచ్చరించింది.

# గిల్ గర్జనతో గుజరాత్ ఘన విజయం

**కేకేఆర్‌పై థ్రిల్లింగ్ ఫైట్‌లో 5 వికెట్ల గెలుపు!**

ఐపీఎల్ 2026లో ఉత్కంఠభరిత పోరులో గుజరాత్ టైటాన్స్ జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌పై 5 వికెట్ల తేడాతో గెలిచి వరుసగా మూడో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన కేకేఆర్‌కు ఆరంభం నుంచే షాక్‌లు తగిలాయి. కెప్టెన్ అజింక్య రహానే డక్ అవుట్ కావడంతో పాటు రఘువంశీ, టీమ్ సీఫెర్ట్ త్వరగానే పెవిలియన్ చేరారు. కేవలం 32 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన సమయంలో కామెరూన్ గ్రీన్ అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టును నిలబెట్టాడు. 79 పరుగులతో పోరాడి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. గుజరాత్ బౌలర్లలో కగిసో రబాడ 3 కీలక వికెట్లు తీసి కేకేఆర్‌ను 180 పరుగులకే పరిమితం చేశాడు. 181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్‌కు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సూపర్ స్టార్ట్ ఇచ్చాడు. సాయి సుదర్శన్‌తో కలిసి పవర్‌ప్లేలోనే 71 పరుగులు సాధించి జట్టుకు బలమైన పునాది వేశాడు. జోస్ బట్లర్ కూడా వేగంగా ఆడి స్కోరును ముందుకు నడిపించాడు. గిల్ అద్భుతంగా బ్యాటింగ్ చేసి 86 పరుగులు సాధించి మ్యాచ్‌ను గుజరాత్ వైపు తిప్పాడు. అదే సమయంలో ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచి ఆరెంజ్ క్యాప్‌ను సొంతం చేసుకున్నాడు. అయితే మ్యాచ్ చివర్లో కాస్త ఉత్కంఠ నెలకొంది. గిల్ అవుట్ అయిన తర్వాత గుజరాత్ బ్యాటర్లు కాస్త ఒత్తిడికి లోనయ్యారు. మ్యాచ్ చివరి ఓవర్ వరకు వెళ్లినా, ఐదో బంతికి విజయం సాధించి అభిమానులను ఆనందంలో ముంచెత్తింది. ఈ విజయంతో గుజరాత్ టైటాన్స్ పాయింట్ల పట్టికలో నాలుగో స్థానానికి చేరుకోగా, కేకేఆర్ మాత్రం ఇప్పటికీ ఈ సీజన్‌లో ఒక్క విజయం కూడా నమోదు చేయలేక అట్టడుగున నిలిచింది.





## ఆకాశమే హద్దుగా!

### ఐపీఎల్ 2026లో సత్తా చాటుతున్న కెప్టెన్ శ్రేయస్ అయ్యర్

*ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ముఖ్యంగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒత్తిడిలోనూ 35 బంతుల్లోనే 66 పరుగులు చేసి అజేయంగా నిలిచి జట్టుకు విజయాన్ని అందించిన తీరు అందరినీ ఆకట్టుకుంది.*

***అయ్యర్ గణాంకాలు, రికార్డులు:***

*ప్రస్తుత సీజన్: 5 మ్యాచ్‌ల్లో 3 హాఫ్ సెంచరీలు.*

*మొత్తం పరుగులు: 203 పరుగులు (టాప్ బ్యాటర్ల జాబితాలో కొనసాగుతున్నాడు)*

*చారిత్రాత్మక రికార్డు: ఐపీఎల్ చరిత్రలో మూడు వేర్వేరు జట్లను (ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్) ఫైనల్ వరకు తీసుకెళ్లిన ఏకైక సారథిగా రికార్డు సృష్టించాడు.*

*గత విజయం: 2024లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు టైటిల్ అందించాడు.*

***టీమ్ ఇండియా కెప్టెన్సీపై చర్చ***

*అయ్యర్ ఇంతటి నిలకడైన ప్రదర్శన చేస్తున్నప్పటికీ భారత వైట్-బాల్ (T20, ODI) జట్టుకు అతడిని కెప్టెన్‌గా ఎంపిక చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.*

*"అయ్యర్ నాయకత్వానికి తగిన గుర్తింపు లభించడం లేదు. టీమ్ ఇండియాను నడిపించడానికి అతను అన్ని విధాలా అర్హుడు."*

***బ్రాడ్ హాడిన్ (పంజాబ్ కింగ్స్ అసిస్టెంట్ కోచ్)***

*ముంబైతో జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా ఇచ్చిన క్యాచ్‌ను అయ్యర్ అందుకున్న తీరు మైదానంలో అతని ఏకాగ్రతకు నిదర్శనమని అభిమానులు కొనియాడుతున్నారు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ రాబోయే వరల్డ్ కప్ దృష్ట్యా అయ్యర్ వైపు మొగ్గు చూపుతుందా లేదా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.*

## మహిళా క్రికెట్‌లో సరికొత్త శకం

క్రికెట్ అభిమానులకు ఐసీసీ మరో తీపి కబురు అందించింది. జై షా నేతృత్వంలోని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. 2026లో ఇంగ్లాండ్ వేదికగా జరగనున్న మహిళల టీ20 ప్రపంచ కప్‌కు ముందు అసోసియేట్ దేశాల క్రికెట్‌ను ప్రోత్సహించే లక్ష్యంతో 'ఐసీసీ మహిళల టీ20 ఛాలెంజ్' అనే కొత్త టోర్నీని ప్రకటించింది.

లక్ష్యం: క్రికెట్‌లో ఎదుగుతున్న అసోసియేట్ దేశాలకు అంతర్జాతీయ వేదికపై గుర్తింపు కల్పించడం.

పాల్గొనే దేశాలు: ఈ తొలి ఎడిషన్‌లో భారత్, ఆస్ట్రేలియా వంటి అగ్రశ్రేణి జట్లు కాకుండా.. రువాండా (ఆఫ్రికా), ఇటలీ (యూరప్), నేపాల్ (ఆసియా), యూఎస్ఏ (అమెరికా), వనౌటు (ఈస్ట్ ఆసియా-పసిఫిక్) అనే ఐదు దేశాలు తలపడనున్నాయి.

వేదిక: మొదటి సీజన్ రువాండాలోని కిగాలీ నగరంలో జరగనుంది.





**ఫార్మాట్, షెడ్యూల్:**

ఈ టోర్నీ డబుల్ రౌండ్-రాబిన్ పద్ధతిలో సాగుతుంది. అంటే ప్రతి జట్టు ఇతర జట్లతో రెండేసిసార్లు తలపడుతుంది.

తేదీలు: ఏప్రిల్ 18 నుంచి మే 1 వరకు.

మ్యాచ్‌లు: గ్రూప్ దశలో ప్రతి జట్టుకు 8 మ్యాచ్‌లు లభిస్తాయి.

విజేత: పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన జట్టు నేరుగా విజేతగా నిలుస్తుంది.

అగ్రశ్రేణి జట్లతో సంబంధం లేకుండా కేవలం ఎదుగుతున్న దేశాల మధ్యే ఈ టోర్నీ నిర్వహించడం వల్ల మహిళా క్రికెట్ ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించే అవకాశం ఉంది. రువాండా వేదికగా జరగనున్న ఈ పోరులో ఏ దేశం పైచేయి సాధిస్తుందో వేచి చూడాలి.

## రహానెను తప్పించండి

**- నరైన్‌కు కెప్టెన్సీ ఇవ్వాలని శ్రీకాంత్ సంచలన వ్యాఖ్య**



ముంబై: ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్‌రైడర్స్ అత్యంత పేలవ ప్రదర్శన చేస్తోంది. ఇప్పటివరకు ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయి పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచింది. జట్టులో స్టార్ ప్లేయర్లు ఉన్నప్పటికీ విజయం దక్కకపోవడంపై అభిమానులు, మాజీలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో టీమ్ ఇండియా మాజీ ఓపెనర్ క్రిస్ శ్రీకాంత్ కేకేఆర్ జట్టు మేనేజ్‌మెంట్, కెప్టెన్సీపై సంచలన వ్యాఖ్యలు చేశారు.

అజింక్య రహానే సారథ్యంపై శ్రీకాంత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "రహానెకు మరో ఒకటి రెండు అవకాశాలు ఇచ్చి చూడాలి. ఒకవేళ మార్పు లేకపోతే అతడిని కెప్టెన్సీ నుంచి తప్పించడం మంచిది." అన్నారు. రహానే స్థానంలో సీనియర్ ప్లేయర్ సునీల్ నరైన్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తే జట్టు మళ్లీ విజయాల బాట పట్టే అవకాశం ఉందని ఆయన సూచించారు. బ్యాటింగ్‌లోనూ రహానె ప్రభావం చూపలేకపోతున్నారని, జట్టుకు అవసరమైనప్పుడు మాత్రమే అతను బ్యాటింగ్‌కు వస్తే సరిపోతుందని పేర్కొన్నారు.

అలాగే కేకేఆర్ జట్టు కూర్పు సరిగ్గా లేదని శ్రీకాంత్ విశ్లేషించారు. ఫిన్ అలెన్, కామెరూన్ గ్రీన్ వరుసగా వైఫల్యం చెందుతున్నారని, వారిని పక్కన పెట్టాలని సూచించారు. వారి స్థానంలో రచిన్ రవీంద్ర, మతీషా పతిరానాలకు అవకాశం ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా రచిన్ రవీంద్రను ఓపెనర్‌గా పంపిస్తే జట్టు సమతుల్యం మెరుగవుతుందని శ్రీకాంత్ అభిప్రాయపడ్డారు.

రింకూ సింగ్ గొప్ప హిట్టర్ ఏమీ కాదు!

స్టార్ బ్యాటర్ రింకూ సింగ్ గురించి శ్రీకాంత్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి "రింకూ సింగ్ పెద్ద హిట్టర్ ఏమీ కాదు. అతను కేవలం చివరి ఓవర్లలో మాత్రమే రాణించగలడు. రన్ రేట్ ఎక్కువగా ఉండి, ఒత్తిడి పెరిగినప్పుడు రింకూ దానిని తట్టుకోలేకపోతున్నాడు."

కార్తీక్ త్యాగి మినహా మిగిలిన ప్లేయర్లు ఎవరూ ఆకట్టుకునేలా ఆడటం లేదని శ్రీకాంత్ స్పష్టం చేశారు. వరుస ఓటములతో సతమతమవుతున్న కేకేఆర్, శ్రీకాంత్ సూచించిన ఈ మార్పులను పరిగణనలోకి తీసుకుంటుందో లేదో చూడాలి.

## పడిక్కల్ రికార్డుపై 'వైభవ్' కన్ను!

**కేకేఆర్‌తో పోరులో 'వెయ్యి' పరుగుల లక్ష్యం**



జైపూర్: ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రకంపనలు సృష్టిస్తున్నాడు. కేవలం 15ఏళ్ల వయసులోనే దిగ్గజ బౌలర్లను వణికిస్తున్న ఈ యువ కిశోరం ఇప్పుడు భారత క్రికెట్ చరిత్రలో ఒక భారీ రికార్డుపై కన్నేశాడు. ఏప్రిల్ 19న కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగే మ్యాచ్ వైభవ్ కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలవబోతోంది.

**ఏమిటా రికార్డు?**

భారత టీ20 చరిత్రలో అత్యంత వేగంగా వెయ్యి పరుగులు పూర్తి చేసిన రికార్డు ప్రస్తుతం దేవదత్ పడిక్కల్ పేరుతో ఉంది. పడిక్కల్ 25 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఘనత సాధించగా... వైభవ్ సూర్యవంశీ కేవలం 23 ఇన్నింగ్స్‌ల్లోనే 901 పరుగులు పూర్తి చేశాడు.

లక్ష్యం: ఏప్రిల్ 19న ఈడెన్ గార్డెన్స్‌లో జరగబోయే తన 24వ ఇన్నింగ్స్‌లో వైభవ్ మరో 99 పరుగులు చేస్తే పడిక్కల్ రికార్డును బద్దలుకొట్టి భారత తరపున అగ్రస్థానానికి చేరుకుంటాడు.

ప్రపంచ రికార్డు: టీ20ల్లో అత్యంత వేగంగా వెయ్యి పరుగులు చేసిన రికార్డు ఆస్ట్రేలియా ప్లేయర్లు షాన్ మార్ష్, బ్రాడ్ హాడ్జ్ (23 ఇన్నింగ్స్‌లు) పేరిట ఉంది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన గత మ్యాచ్‌లో వైభవ్ డకౌట్ కావడంతో ఈ ప్రపంచ రికార్డును తృటిలో కోల్పోయాడు.

ప్రపంచ స్థాయిలో మూడో స్థానానికి అవకాశం:

వైభవ్ తన 24వ ఇన్నింగ్స్‌లో 1000 పరుగులు పూర్తి చేస్తే అంతర్జాతీయ స్థాయిలో మాథ్యూ హేడెన్ (24 ఇన్నింగ్స్‌లు) సరసన నిలుస్తాడు. తద్వారా ప్రపంచవ్యాప్తంగా మూడో స్థానంలో, భారత స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి సరికొత్త చరిత్ర సృష్టిస్తాడు.

## 'రాకా'లో షారుక్ టాక్..

పతాక స్థాయిలో అంచనాలున్న భారతీయ చిత్రాల్లో 'రాకా' ఒకటి. 'పుష్ప' సినిమాలతో దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్ని అలరించిన అల్లు అర్జున్ కథానాయకుడిగా – అట్లీ దర్శకత్వంలో రూపుదిద్దుకొంటున్న చిత్రమిది. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమా ఫస్టుక్ ఇటీవలే విడుదలై అందరి దృష్టినీ ఆకర్షించింది. అల్లు అర్జున్ సరికొత్త అవతారంలో కనిపించి సినిమాపై మరింత ఆసక్తి రేకెత్తించారు. ముంబయిలోనే ఎక్కువగా చిత్రీకరణ చేసుకొంటున్న ఈ సినిమాలో బాలీవుడ్ అగ్రతార షారుక్ ఖాన్ అతిథి పాత్రలో నటిస్తున్నారనే ప్రచారం ఊపందుకుంది. దర్శకుడు అట్లీ – కథానాయకుడు షారుక్ మధ్య మంచి సంబంధాలున్నాయి. ఈ ఇద్దరూ కలిసి ఇదివరకు 'జవాన్' చిత్రం చేశారు.



ఆ అనుబంధం దృష్ట్యా షారుక్ అతిథి పాత్ర ప్రచారానికి బలం చేకూరుతోంది. ఇందులో కథానాయికగా దీపికా పదుకొణె నటిస్తున్నారు. ఆమెతోపాటు రష్మిక, జాన్వీకపూర్, మృణాల్ ఠాకూర్ పేర్లు కూడా వినిపిస్తున్నప్పటికీ, అధికారికంగా మాత్రం ఇంకా చిత్రబృందం వెల్లడించలేదు. ఇందులో ప్రధాన పాత్రల్లో ఎవరు? అతిథి పాత్రల్లో ఎవరనే విషయంపై స్పష్టత రావడానికి మరింత సమయం పట్టే అవకాశాలున్నాయి. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలోని లుక్ కోసం అల్లు అర్జున్ రోజూ 3, 4 గంటలు సమయం వెచ్చిస్తున్నారని సినీవర్గాలు చెప్పాయి.

## కోలీవుడ్‌కి షాక్..
## జైలర్-2 సీన్ లీక్



కొన్ని రోజుల క్రితం 'జన నాయగన్' సన్నివేశాలు ఆన్‌లైన్‌లో లీకైన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో స్టార్ హీరో మూవీ సీన్స్ లీక్ కావడంతో కోలీవుడ్‌లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న 'జైలర్ 2' షూటింగ్ దశలోనే లీకైనట్టు సమాచారం. ఈ మూవీలోని కీలక సన్నివేశం షూటింగ్‌కు సంబంధించిన ఫుటేజీ బయటకు వచ్చినట్టు తెలిసింది. దీనిపై స్పందించిన నిర్మాణసంస్థ సన్ పిక్చర్స్.. తమ యాంటీ పైరసీ రంగంలోకి దిగిందని కోలీవుడ్ మీడియా పేర్కొంది. హిట్ మూవీ 'జైలర్‌కు సీక్వెల్ 'జైలర్–2'ను తెరకెక్కిస్తున్నారు దర్శకుడు నెల్సన్ దిలీప్కుమార్.

## అది దాటేస్తే..
## విడుదలకు రెడీ



డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ ప్రస్తుతం తెరకెక్కిస్తున్న చిత్రం 'స్లమ్‌డాగ్' ఇప్పటికే షూటింగ్ పనులు ముగించుకుంది. వెర్సటైల్ యాక్టర్ విజయ్ సేతుపతి లీడ్ రోల్‌లో నటిస్తున్న సినిమాపై ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేటైంది. సినిమాను ఎప్పుడెప్పుడు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారా? అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. అయితే, షూటింగ్ పూర్తయినా, రిలీజ్ డేట్ విషయంలో ఆలస్యం జరుగుతున్నట్టు తెలుస్తోంది. దీనికి ప్రధాన కారణం రిలీజ్ డేట్ ప్రకటించే ముందు ఓటీటీ డీల్ కుదుర్చుకోవాలని మేకర్స్ భావిస్తున్నారు. కానీ ప్రస్తుతానికి సరైన ఓటీటీ పార్ట్నర్ దొరకకపోవడంతో సందిగ్ధత నెలకొంది. ఈ డీల్ ఖరారైన వెంటనే అధికారిక విడుదల తేదీని ప్రకటించే అవకాశముందని తెలుస్తోంది. 'పూరీ కనెక్ట్స్' బ్యానర్‌పై పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న చిత్రంలో టబు, సంయుక్త, దునియా విజయ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతాన్ని అందిస్తున్న సినిమాను తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం మరియు హిందీ భాషల్లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు.

## రెండు ఓటీటీల్లో తెలుగు థ్రిల్లర్

ఎలాంటి ప్రచారం లేకుండా సైలెంట్‌గా రెండు ఓటీటీల్లో రిలీజైంది 'సుయోధన'. ప్రియదర్శి హీరోగా నటించిన ఈ సినిమా శుక్రవారంనుంచి 'జియో హాట్ స్టార్', 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో స్ట్రీమింగ్ అవుతోంది. హాట్‌స్టార్‌లో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీలో, అమెజాన్ ప్రైమ్‌లో తెలుగు, తమిళంలో విడుదలైంది. ద్రిషిక చందర్ హీరోయిన్‌గా నటించిన సినిమాలో సాయికుమార్, ప్రేమ తదితరులు కీలక పాత్రలు పోషించారు. మాధవ్ రెడ్డి తెరకెక్కించిన ఈ సైకాలజికల్ థ్రిల్లర్ మూవీ మార్చి 27న బాక్సాఫీసు ముందుకొచ్చింది.

ఈ సినిమా కథేంటంటే: వరుణ్ (ప్రియదర్శి) సౌండ్ డిజైనర్. బాల్యంనుంచీ అతడికి సుయోధన అని వినిపించిన ప్రతిసారీ.. దుర్యోధనుడు ప్రత్యక్షమైనట్టు అనిపిస్తుంటుంది. వరుణ్ తండ్రి ప్రకాశ్ (సాయికుమార్) నాటకాలు ప్రదర్శిస్తుంటాడు. ఆయనకు దుర్యోధనుడి పాత్రంటే చాలా ఇష్టం. ఇది చూసే వరుణ్ భయపడుతున్నాడని అతని తల్లి, వైద్యులు చెప్పడంతో.. ప్రకాశ్ నాటకాలకు దూరమవుతాడు. తన భయం పోయిందనుకున్న వరుణ్ సొంతంగా స్టూడియోను నడిపిస్తూ ప్రశాంతంగా జీవితాన్ని సాగిస్తుంటాడు. ఓరోజు సమిత (ద్రిషిక) డెమో ఫిల్మ్ షూటింగ్ చేయడానికి వరుణ్ స్టూడియోకి వస్తుంది. సమిత షూట్ చేసిన వాటిలో ఓ పాత్ర వరుణ్‌కి దుర్యోధనుడిలా కనిపిస్తుంది. ఏదో ప్రమాదం పొంచి ఉన్నప్పుడే ఇలా జరుగుతుందని తెలుసుకుంటాడు. మరి, వరుణ్‌కు ఎలాంటి ప్రమాదాలు జరిగాయి? అసలు తనకు సుయోధన అనే శబ్దం వినిపించడానికి కారణమేంటి? అన్నది కీలకాంశం.



## సీన్‌లోకి సారా వచ్చేనా?

తమిళ స్టార్ హీరో ధనుష్ వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నాడు. ప్రస్తుతం ఆయన 'కర' సినిమా విడుదలకు సిద్ధమవుతుండగా, దర్శకుడు తమిళరసన్ పచ్చముత్తు దర్శకత్వంలో 'డీ–56' అనే చిత్రానికి శ్రీకారం చుట్టాడు. ఈ సినిమాలో ధనుష్ సరసన నటించే హీరోయిన్ ఎవరనే విషయంలో గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వస్తున్నాయి. మొదట ఈ ప్రాజెక్ట్ కోసం కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ పేరు వినిపించింది. అయితే, ఆమె ప్రస్తుతం ఇతర సినిమాలతో బిజీగా ఉండటం వల్ల డేట్స్ సర్దుబాటు చేయలేక ఈ చిత్రం నుండి తప్పుకున్నట్లు సమాచారం. దీంతో చిత్ర బృందం ఇప్పుడు మరో కొత్త హీరోయిన్ కోసం వెతకడం మొదలుపెట్టారు. తాజా సమాచారం ప్రకారం, బాలీవుడ్ యువ నటి సారా అర్జున్‌ను ఈ పాత్ర కోసం ఎంపిక చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇటీవల ధురంధర్ చిత్రంతో నేషనల్ స్థాయిలో మంచి బ్లాక్‌బస్టర్ అందుకున్న ఈ బ్యూటీ ఇప్పుడు తమిళంలో నటించే ఛాన్స్ అందుకుంది. అయితే, దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



## బాలయ్యతో డింపుల్ సెల్ఫీ

నందమూరి బాలకృష్ణ, యువ నటి డింపుల్ హయాతి కలిసి చేసిన సందడి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గుంటూరులో జరిగిన ఒక ప్రైవేట్ కార్యక్రమంకోసం వీరిద్దరూ కలిసి ప్రయాణించడమే కాకుండా, అక్కడ దిగిన ఫొటోలు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గుంటూరులోని లక్ష్మీపురంలో ఒకప్రముఖ జ్యువెలరీ షోరూమ్ ప్రారంభోత్సవానికి బాలకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయనతో పాటు డింపుల్ హయాతి కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరిద్దరూ హైదరా బాద్ నుంచి గుంటూరుకు ప్రత్యేక హెలి కాప్టర్‌లో ప్రయాణించారు. ఈ ప్రయాణ సమయంలో డింపుల్ హయాతి తన ఫోన్‌లో సెల్ఫీతీయగా.. పక్కనే ఉన్న బాలయ్య చిన్న పిల్లాడిలా రకరకాల క్యూట్‌ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ అల్లరి చేశారు. సాధారణంగా గంభీరంగా కనిపించే బాలయ్య,ఇంత సరదాగా ఉండటాన్ని చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు.

ప్రస్తుతం బాలయ్య గోపీచంద్ మలినేని దర్శకత్వంలో 'ఎన్బీకె 111' (వర్కింగ్ టైటిల్) చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో డింపుల్ హయాతి రెండో హీరోయిన్‌గా నటిస్తోందని ఇప్పటికే వార్తలు వస్తున్నాయి. తాజాగా వీరిద్దరూ కలిసి ఒకే ఈవెంట్‌లో కనిపించడంతో,ఈ రూమర్లు నిజమేనని ఫ్యాన్స్ భావిస్తున్నారు. అయితే, దీనిపై చిత్ర యూనిట్ నుండి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

